
జూలై 1974

58

సృజన

ఆధునిక సాహిత్య వేదిక



భూస్వాముల, దళారీ బూర్జువాల
అమెరికా రష్యా సామ్రాజ్య
వాదుల దోపిడికి గురియై
రోగపీడితమైన ఈ దేశ
ఆర్థిక రాజకీయ వ్యవస్థకు
మా విప్లవం శస్త్రచికిత్స-

- వివేకం ఉన్నవాడెవ్వడూ
శస్త్రచికిత్స నేరమనికానీ,
సర్జన్ నేరస్థుడనిగానీ
అనడానికి సాహసించడు.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

జూలై 1974

58

'సృజన' సహాయ నిధి

ప్రజలు విప్లవాలకోరే యీ యుగంలో విప్లవ పత్రికలు నిర్వర్తించవలసిన బాధ్యత గురుతరమైనది- ఐతే నేటి వ్యవస్థలో ప్రజా పత్రికలను ఆర్థిక యిబ్బందులనుంచి అనేక ఆటుపోటులనుంచి కాపాడుకొనే బాధ్యత ప్రజలదే. కాగితం ధర, ముద్రణావ్యయం విపరీతంగా పెరిగిపోయిన యీ సమయంలో 'సృజన' కొనసాగడం కష్టమైపోయి 'సృజన సహాయనిధి' ప్రారంభిస్తున్నాం. పాఠకుల, రచయితల, అభిమానుల అండదండలే బలంగా విప్లవ సాహిత్య వేదికగా యింతకాలం తన విప్లవ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న 'సృజన'కు యికముందుకూడా ఆ ఆదరణ సహకారం నిరాఘాటంగాలభిస్తాయనే విశ్వాసం మాకున్నది. పాఠకులూ, రచయితలూ, అభిమానులూ 'సృజన సహాయనిధి'కి విస్తృతంగా విరాళాలందజేసి విప్లవమార్గంలో 'సృజన' నిర్విఘ్నంగా సాగేట్లు చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాం.

మనియార్డర్లూ, చెక్కులూ దిగువ అడ్రసుకు పంపండి-

ఎడిటర్ 'సృజన'
హనుమకొండ - 506001.

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

1 రూపాయి

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

తుపాకీ రాజులు

దేశమంటే మట్టికాదు— దేశమంటే మనుషులూకాదు— దేశమంటే పోలీసులు. విప్లవ రచయితల అరెస్టులకు నిరసనగా బహిరంగసభ పెట్టుకొంటే వరంగల్ విరసం వాళ్ళకు మైక్ పర్మిషన్ నిరాకరించాడు యిక్కడి ఎస్ పి— ఇదీ ప్రజాస్వామ్యమంటే! మీటింగులకేకాదు యీ దేశంలో ఊపిరిపీల్చుకోవాలన్నా పోలీసుల పర్మిషన్ కావాలి— చీకటి బజార్లలో, సారాకొట్లలో, జూదగృహాల్లో, ఝూటా సాక్ష్యాల్లో, హత్యానేరాల్లో రకరకాల దోపిడీలలో, ప్రజాజీవితం మలినంచేసే ప్రతి పనిలో మునిగితేలే పోలీసులు ప్రజా కార్యక్రమాలకు పర్మిషన్‌దార్లు!

భారత దేశ అధ్యక్షులవారు 'ఊరేగే' రథంచుట్టూపోలీసులు, ఇందిరమ్మ ముందూ వెనకా పోలీసులు— దోపిడీదార్ల, భూస్వాముల గాదెల, గల్లాపెట్టెలచుట్టూ పోలీసులు— ఈ దోపిడీవ్యవస్థ పరిరక్షకులు పోలీసులు!

తిండిగింజలకోసం తిరగబడ్డ బీహార్, గుజరాత్ విద్యార్థుల గుండెల మీద కాల్పులు— భుక్తి కోసం, విముక్తి కోసం, సమాజంలో ఉనికికోసం పోరాడే గిరిజనుల మీద, హరిజనులమీద, కార్మిక కర్షక యువజనులమీద, కాల్పులు. పీడిత ప్రజాజీవన భక్షకులు పోలీసులు— పేదల నెత్తురు పానీయాలమత్తులో, అర్ధరాత్రి నిషా, ఖుషీలలో యీ దేశాన్ని దివారాత్రులు పాలించే యూనిఫారం రాజులు పోలీసులు.

పోలీసులంటే తుపాకులు— కాల్పులు. పోలీసులంటే సంకెళ్ళు— జైళ్ళు. అస్థిపంజరాలమీద కవాతుచేసే ముళ్ళబూట్లకాళ్ళు— ఆకలి డొక్కలు చీల్చుకపోయే యినుపగుళ్ళు. పోలీసులంటే కుళ్ళు— పోలీసులంటే కుట్ర. ఒక్కమాటలో పోలీసులంటే ప్రభుత్వం. ప్రభుత్వమంటే దోపిడీ— స్వదేశీ విదేశీ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ దోపిడి.

లెనిన్ చెప్పినట్లు యివాళ రెండు విభిన్న ప్రపంచాలు ఒకదానికొకటి ఎదురెదురుగా మోహరించి ఉన్నాయి. ఒకటి శ్రామికుల పీడితప్రపంచం— ఇంకొకటి పెట్టుబడిదార్ల దోపిడీ ప్రపంచం.

అయితే ఆకలి కడుపులతో అరణ్యాలై మండుతున్న పీడిత ప్రజా సాయుధ విప్లవతరంగాల తాకిడికి యీ పుచ్చిపోయిన దోపిడీ పోలీసుల తుపాకులు ముక్కలై పోతాయి— ఈ విప్లవ చరిత్రగతిని ఏ తుపాకులూ, బాంబులూ ఆపలేవు.

ఐక్యత

కామ్రేడ్స్! ప్రజలకోసం ఐక్యంగా పోరాడండి ప్రజలతో ఐక్యమై పోరాడండి పోరాటం ప్రజల్నికలిపి శత్రువుల్ని విడదీసేశక్తి, పోరాటం మనల్ని ఉక్కుమనుషులుగా తీర్చే దీప్తి. పోరాటం వ్యక్తుల్ని చరిత్రముందు వినమ్రంచేసి చరిత్రగతిని నిరూపించే సామాజికసూత్రం. చరిత్రను ప్రజలు రచిస్తారు.

‘ప్రజలు– ప్రజలుమాత్రమే ప్రపంచ చరిత్ర నిర్మాణంలో చోదకశక్తి’.

మనం విప్లవాలు నడుపుతున్నామన్నా మనం విప్లవాలు పాడుతున్నామన్నా ‘ప్రజలు విప్లవాలు కోరుతున్నారు’ గనుక. విప్లవం యీ యుగధర్మం.

కామ్రేడ్స్! ఇంకా గొప్పవిజయాలను సాధించడంకోసం ఐక్యంకండి శ్రామికవర్గ నియంతృత్వ స్థాపనకోసం ఐక్యంకండి. నూతన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడానికి ఐక్యంకండి.

చాలా కష్టంగా కనిపించేది చాల సులభం, చాలా భయంకరంగా కనిపించేది చాల పిరికిది. అణుబాంబు సృష్టించిన కృత్రిమ పర్వతంకూడ కూలుతున్న పాలకవర్గం వణుకును దాచలేదు చాల సులభంగా అనిపించేది చాల కష్టం. పాదెమీదికెక్కిన సామ్రాజ్యవాదానికి సాయుధంగాతప్ప చరమగీతం పాడలేం.

బూర్జువా చరిత్రలో చేయబడిన యుద్ధాలన్నీ, రాయబడిన విజయాలన్నీ పిడికెడు దోపిడీవర్గాలవి విప్లవయుద్ధం ప్రజల ఎర్రజండా. మన విజయం ప్రజలది. ఇంకెవ్వడో కోసుకపోవడానికి అలుకుతున్న పొలంకాదిది, ఇంపీరియలిజమ్ దోచుకపోవ వొడుస్తున్న చెమటకాదిది.

కామ్రేడ్స్! మన ప్రతి ఓటమీ మనం గెలుస్తామనే నమ్మకాన్ని పెంచాలి. కాలుతున్న ఇనుంమీద సమ్మెటపోటు సంకల్పాల పనిముట్లను మలుస్తుంది. పగులుతున్న విత్తనం విప్లవాలు వికసించే విశ్వాసం మొలకెత్తించాలి. ‘భవిష్యత్తు ఉజ్వలంగా వున్నది’ బాట బాధలతో నిండివుంటేమాత్రం యేం. మనచేతిలో మావో ఆలోచనా విధానం సూక్ష్మదర్శినీ, దూరదర్శినీ వున్నాయి. మార్క్సిజమ్– లెనినిజమ్ మన జ్ఞాననేత్రం.

ప్రజల ఆశయం మనగమ్యం, పోరాటం మన ముందడుగు మనం ముందుకు పోతుంటే చీకట్లు వెనక్కిపోతాయి. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. పడమటికి నడచి తూర్పుకు చేరుకోలేం. వెనక్కినడిచీ ముందుకు చేరుకోలేం. ఎంత మహత్తర ఆశయమైనా ఆచరించకుండా సాధించలేం. దూరం దగ్గర కావాలంటే, గమ్యం చేరుకోవాలంటే ప్రయాణంచేయాలి. ఒళ్ళలవకుండా ప్రయాణంలేదు. రేపటిలోకి నడుస్తున్న కాలం చీకట్లను చీల్చకుండా కాంతిని ఆవిష్కరించదు.

'ఏటికి ఎదురీది' లక్ష్యంచేరుకోవడం మన స్వభావం. కష్టాలను పోరాటంలో అధిగమించడం మన కర్తవ్యం. భవిష్యత్తు ఉజ్వలంగా వున్నది. కామ్రేడ్స్! త్యాగారుణ ఆకాశంలో ఉదయించే విప్లవ సూర్యోదయాల్ని రచిద్దాం.

మన రాజకీయాలు మంచివయితే ఇవ్వాల ఒంటరివాళ్ళమయినా, రేపు నావ, తెరచాప, తెడ్డు అవేవస్తాయి. కెరటాల సహస్ర హస్తాలతో విసిరికొడుతున్న సముద్రం కోరలు పీకేసిన సర్పంపలె అణగిపోతుంది. పాలకవర్గాల ప్రజా వ్యతిరేక దుర్గాన్ని నాయకత్వమూ, సైన్యమూ కేంద్రీకృత అధికారమూ ఏదీ కాపాడజాలదు. నీబలంకాదు—— అసలు ప్రజల్ని, ప్రజాపోరాటాల్నివదిలి నీకు బలంలేదు. 'సమస్తాన్నీ సరియైన రాజకీయపంథా నిర్ణయిస్తుంది'. పుటంపెట్టితే బంగారం మరింత వన్నెతేలినట్లుగా పోరాటాగ్ని మంచి కమ్యూనిస్టును ప్రకాశింపచేస్తుంది.

భయం వ్యక్తి లక్షణం. స్వార్థం దానితల్లి ఫలం రివిజనిజం వేర్లు బూర్జువా ఆలోచనలో వున్నవి. 'దృఢంగావుండు, ఏ త్యాగానికీ వెనుదీయకు. విజయాన్ని సాధించ దానికి అన్నికష్టాలూ అధిగమించు'.

చీమలు చాల కష్టపడి పుట్టల్నిపెట్టుకుంటాయి. పాములు వాటిని కోటలగా మార్చుకుంటాయి. దిక్కులేని చీమలు బిక్కమొహంవేస్తాయా? బలవంతమైన సర్పాన్నయినా చీమల్నించి ఏ శక్తీ రక్షించలేదు. పేదవాళ్ళకోపం ఒకసైపేనిన తాడులా ఎంత బలాన్నయినా లొంగదీస్తుంది.

విజయాన్ని ప్రజలు, పంథా ఖాయం చేస్తాయి. విప్లవఐక్యత త్వరితంచేస్తుంది. అందుకే 'రివిజనిజాన్నికాదు, మార్క్సిజాన్ని ఆచరించండి విడిపోవద్దు, ఐక్యంగా వుండండి. కుట్రలూ కుహకాలు పన్నవద్దు స్వచ్ఛంగా, దాపరికం లేకుండా వుండండి' మార్క్సిజాన్ని ఆచరించే మార్గంలో మరుగు పరచాల్సిందేదీలేదు. మార్క్సిజాన్ని ఆచరించే వర్గాలమధ్య మసిబూసి చూపాల్సిందీలేదు. మానవ సమాజాన్ని దోపిడీకి వ్యతిరేకంగా సంఘటితంచేసే పోరాటంలో కాలిన ఉక్కు అతికినట్లుగా విప్లవ శక్తులు ఏకం కావాలి.

తుఫానులకు భయపడేవాడు జాలరికాడు. నిర్దాక్షిణ్యంగాసాగే పోరాటంలో అరెస్టులకు, అణచివేతలకు అదరిపోయేవాడు అర్భకుడు. 'శ్రామికవర్గ వారసులు అనివార్యంగా తుఫానులనుంచే పుట్టుకొస్తారు' 'మహాసంక్షోభం గొప్పశాంతికి దారితీస్తుంది' కెరటాలకు ఎదురీది తుఫానులనుంచి శ్రామికక్రాంతిని సాధిద్దాం. కామ్రేడ్స్ విప్లవం కుట్రకాదు. చీకటితో పోరాటం వెలుగులతో ఐక్యత. ప్రజలకోసం ఐక్యంగా పోరాడుదాం ప్రజలతో ఐక్యమై పోరాడుదాం.

[ఆధారం: చైనా కమ్యూనిస్టు పార్టీ 10 వ జాతీయ కాంగ్రెస్ డాక్యుమెంట్స్]

రెడ్ సిగ్నల్

శివసాగర్

రెడ్‌సిగ్నల్—
ప్రభుత్వం చక్రాలు కదలవు
ఇంజన్‌లో డూమ్‌జాయింట్
ప్రమాదాన్ని సూచిస్తోంది
ప్రభుత్వ దమనకాండ ఎక్స్‌ప్రెస్‌కు
లైన్ క్లియరెన్స్ లేదు
అణగారిన కార్మికశక్తి
అగ్నిపర్వతంలా బద్దలవుతోంది

"హలో! హలో!
సంపాదక ఛింపంజీ?
నీ సంపాదకీయం బూరెల మూకుళ్ళో
నీకు నచ్చిన అబద్ధాల పిండివంట వండుకో
పతాక శీర్షికలో నిజాన్ని బహిరంగంగానే ఉరితీసికో
ఒకింత బాల్యస్నేహం తలచుకొని
రవంత నిజం చెప్పరా! నేస్తం!
ఎలావుంది సమ్మె పరిస్థితి?"

"అయ్యా! శివసాగరం గారూ!
మీరు తాడూ బొంగరం లేనివారు
ఏమయినా మాట్లాడుతారు
ఉద్యోగం ఉరితాడుతో
మా జీవితం బొంగరాలను ఆడిస్తున్నాడు బాసు
వాడే మా పాలిట ఏడుకొండల శ్రీనివాసు
ఒకింత పాతస్నేహం తలచుకొని
రవంత నిజం చెప్పమంటున్నారు
వినండి! ఎక్కడా అనకండి?
ఢిల్లీ తుగ్లకాబాద్ రైల్వేయార్డ్‌లో
ప్రభుత్వానికి పిచ్చెక్కింది
కాలనీలో పిల్లల్ని, పెద్దల్ని
వెంటబడి కరుస్తోంది

విక్టోరియా టెర్మినస్‌లో
'డక్కన్ క్వీన్' కూలబడింది
జోలర్‌పేటలో
'బ్లూ మౌంటన్' కదలదు
మొగల్ సరాయి మార్షలింగ్ యార్డ్‌లో
ప్రభుత్వానికి నర్వెస్ బ్రేక్ డౌన్
పరిస్థితి ప్రమాదంగా వుంది
ప్రభుత్వం ఆస్పత్రి పాలయింది—
ఇక ఉంటారా శి.సా! ఈరోజు బలే సంపాదకీయం రాశా!

పత్రికాముఖం అబద్ధాల ఫేస్‌పౌడర్ రాసుకొని
ఉదయం చౌరస్తాలో కనుసైగ చేస్తోంది
సమ్మె విఫలమవుతోందని
సంపాదకీయం ఢంకా బజాయించింది
రైలుబళ్ళన్నీ పత్రికల్లో ప్రయాణం చేస్తున్నాయ్
పతాకశీర్షికలో సత్యం శీర్షాసనం వేస్తోంది

"హలో! హలో! ఎమర్జన్సీ వార్డ్!
ఎవరండీ! డాక్టర్ కాలచక్రంగారున్నారండీ!
ఉంటే ఒకసారి పిలవండి...
హల్లో! డాక్టర్! ఎలావుంది పేషంట్ ప్రభుత్వం?
ఉందంటారా దీనికి బతికి బట్టకట్టేయోగం!"

"కేసు చాలా సీరియస్
దీనికి అన్నీ రోగాలే
ఆపరేషన్ అవసరం
అనాస్తీషియా ఇస్తున్నాం
ఉంటా... ఎమర్జన్సీ"

జైళ్ళు నోళ్ళు తెరుస్తున్నాయి
హిప్పొపొటమస్‌లాగ
కార్మికుని గుండెమీదుగా
దేశం సరిహద్దు గీసి

అక్కడికి సరిహద్దు భద్రతా దళాన్ని
ప్రభుత్వం హుటాహుటి దూకిస్తోంది
బయ్‌నెట్ కొనమీద రాజ్యాన్ని నిలుపుతోంది
గోల్డెన్‌రాక్‌లో నిన్న రాలిన
కార్మిక నక్షత్రం
మళ్ళీ దేశం ఆకాశంమీద
సగర్వంగా ప్రకాశిస్తోంది
నగరంలో పారిన కార్మికరక్తం
పల్లెదిక్కుగా ప్రవహిస్తోంది
దేశమంతా పెనుతుఫానులా వీస్తోన్న
కార్మికుల బిగిపిడికిళ్ళలో
ఎర్రని చైతన్యం కనిపిస్తోంది
దేశం గుండెల్లో విప్లవ ఘడియలు మోగిస్తోంది

"హలో! హలో!
ఫైర్మన్ చైతన్యం! కామ్రేడ్ చైతన్యం!
ఎలా వున్నావ్? ఏం చేస్తున్నావ్?
ఏ భూగర్భంలోవుండి ఎన్ని మెగాటన్నుల
జనశక్తి పేలుస్తున్నావ్?"

"కామ్రేడ్! సాగరం!
అద్భుతంగావున్న పరిస్థితిని
ఇంకా అందుకోలేకపోతున్నాం
సర్కారీ వాహనం పడగొట్టేందుకు
జనం ఫిష్‌ప్లేట్లు తొలగిస్తున్నారు
దోపిడీబాబుల ఫస్ట్‌క్లాస్ భోగీలపై
పెట్రోల్‌పోసి తగలెడుతున్నారు
'నల్లకాళ్ళ'ను విరగ్గొట్టి
కళ్యాణ్ కారడవులకు తోలేస్తున్నారు
ఆకలి గూడ్స్ ట్రెయిన్
అధిక ధరల డీసిల్‌ను ఢీకొట్టింది

ప్రభుత్వ వాగ్దానాల మాల్గోవా మామిడిపళ్ళు
ప్లాట్‌ఫారంమీద కుళ్ళిపోతున్నాయి–
అద్భుతంగా వుంది పరిస్థితి
అడవిలోని అగ్నికి ఆజ్యం పోస్తున్న నగరాలు
తిరగబడ్డ కొడవళ్ళతో
చేతులు కలిపేందుకు సన్నద్ధమవుతోన్న సమ్మెటలు–

మరిచిపోయాను, మరొక్క మాట;
విద్రోహ నాయకత్వం నట్టేటిలో పుట్టి ముంచేందుకు
గట్టి ప్రయత్నమే చేస్తోంది
ఫలితం ఏమయినా, నేటి ఈ పోరాటాలు
రేపటి మహోజ్వల పోరాటాలకు వాద్దికలు
రానున్న జీవన్మరణ సంగ్రామాలకు శిక్షణా శిబిరాలు–
ఉంటా సాగరం! నేను వెళిపోవాలి వేగిరం!

నిజంలాంటి నిప్పులాంటి ఉదయంతో
రాకాసివాణి బాకావ్యాఖ్యాత
పండిత పరమాన్నంగారి సూక్తిముక్తావళి:

వినండి! మహాజనులారా!
గిట్టనివాళ్ళు మా ప్రభుత్వానికి కళ్ళులేవంటున్నారు
వాళ్ళంతా కళ్ళున్న మా ప్రభుత్వానికి
కళ్ళు లేకపోవడమేమిటి?

గిట్టనివాళ్ళు మా ప్రభుత్వానికి
గుండెపోటని దుష్ప్రచారం చేస్తున్నారు
గుండెలేని మా ప్రభుత్వానికి
గుండె పోటేమిటి!

గిట్టనివాళ్ళూ, కన్నుకుట్టినవాళ్ళూ
మా ప్రభుత్వానికి హృద్రోగం అంటున్నారు
హృదయమేలేని మా ప్రభుత్వానికి
హృద్రోగం ఏమిటి?

మా ప్రభుత్వం సజావుగావుంది
ఆస్పత్రిలోవున్నా సజీవంగానే వుంది—
కళ్ళకు కనిపించకపోయినా
బళ్ళు బ్రహ్మాండంగానే నడుస్తున్నాయ్
[ఆధ్యాత్మికదృష్టి అలవర్చుకోండి!]

ఎప్పుడూ ఊడూ గుడ్డా కొంపా గోడేనా?
అన్నవస్త్రాలు లేకపోతేనేం?
అణ్వాస్త్రాలుంటే చాలదూ!
అవకాశవాణి రాకాసి ప్రసారం
ఇంతటితో సమాప్తం"
[ఎంచక్కా సమర్థించాడు!]

"హలో! హలో! హలో!
హలో! డాక్టర్ కాలచక్రంగారూ!
ఎలావుంది పేషంట్ ప్రభుత్వం
ఏ సంగతీ చెప్పారు కాదు?"

"ఆపరేషన్ సక్సెస్
పేషంట్ ఎంతోకాలం బతకదు"

విప్లవ రచయితలం

యాత్రిక్

పేద ప్రజల కష్టంలో
రగిలిన కోపాగ్నులం
పీడితజన విప్లవాలు
పాడుతున్న రచయితలం

నక్సల్‌బరి మోగించిన
సాయుధ ప్రజాకంఠాలం
శ్రీకాకుళ పోరాటం
తూర్పుగాలి కెరటాలం ॥పేద॥

పాణిగ్రాహి వారసులం
అరుణోదయ గాయకులం
మేం విప్లవ రచయితలం
సాంస్కృతిక సైనికులం ॥పేద॥

సాగుతున్న ప్రజాయుద్ధ
ఎర్రజెండ నెగరేస్తాం
శ్రామికజన ఐక్యతయే
సరిహద్దుగ ఎంచుతాం ॥పేద॥

మావో ఆలోచనయే
మా పాటకు గీటురాయి
ఆలోచన ఆచరణ
ప్రజల కత్తి రెండంచులు ॥పేద॥

మానవ శ్రమ తీర్చినట్టి
కళలూ నాగరికతలూ
కష్టజీవి చేతిచలవ
ఉత్పత్తులు సంపదలు
కొల్లగొనే మార్గానికి
మనిషి శ్రమను లాభంగా
మార్చుకునే వర్గానికి
శత్రువులం, విరోధులం ॥పేద॥

భూస్వాముల దళారీల
పెత్తందారుల దోపిడి
మారుపేరు పరిపాలన
దానికంచె రాజ్యాంగం ॥పేద॥

వర్గాలకు సంఘర్షణ
అనివార్యం – శాస్త్రీయం
సాయుధ మార్గం ఒకటే
సాధించును శ్రమరాజ్యం ॥పేద॥

చరిత్ర చెప్పిన సత్యం
చాటుతున్న రచయితలం
చారిత్రక కర్తవ్యం
చేపట్టిన పౌరులం
పేద ప్రజల కష్టంలో
రగిలిన కోపాగ్నులం
పీడితజన విప్లవాలు
పాడుతున్న రచయితలం ॥పేద॥

మా పల్లె

సంతాల్

పైరగాలికి వేడినెత్తురొచ్చిందంట
పలుగురాళ్ళకు ప్రాణమొచ్చి లేచాయంట
ఎండుపుల్లలు గుండె పొంగి నడిచాయంట
మా పల్లె ఎరిమల్లె పాగాయెనా
పెద్ద ఏటిని కొత్త అలలేచెనా
పెద్ద ఏటిని.........

ఎర్రచీమలదాసు జోరు హెచ్చిందంట
గబ్బిలమ్ములు చీకటింటికెళ్ళాయంట
పడగ పాముల గడగడప నిలిపాయంట
మా పల్లె ఎదనింద పగరగిలెనా
కొండచిలువల గుండె దిగజారెనా
కొండ చిలువల...........

చెట్టుచేమలు పిలిచి పండ్లు పంచాయంట
మేకపిల్లలు మంచిపాలు తాపాయంట
ఆయిలూ గుట్టల్లు అందనిచ్చాయంట
మా పల్లె వెలుగు బిడ్డల కన్నదా
కడుపులో దాచుకొని కలగన్నదా
కడుపులో.............

మొసళ్ళు ఏటిపై కుట్ర మోపాయంట
కత్తి కొటాలతో ఏరు కదిలిందంట
కత్తి పీటలు పేట కదలి వచ్చాయంట
మా పల్లె అంకుశమై నిలిచెనా
అలవేటుకే గట్టు జల పట్టెనా
ఆలవేటుకే...,...........

కాకి మబ్బులు పల్లె కమ్ముకున్నాయంట
మబ్బు కొవ్వును మెరుపులొరిసి కోసాయంట
గూని మబ్బుల ఉరుములదర గొట్టాయంట
మా పల్లె పిడుగులై వర్షించెనా
పాడుగోడలు కూలి పడిపోయెనా
పాడు గోడలు...............

పక్క పల్లెలు ఎరుపు పాటందుకొనెనంట
బక్క జీవుల రక్త మెరుపెక్కినాదంట
పల్లె పల్లెను మంటలంటుకున్నాయంట
మా పల్లె విప్లవాగ్నుల గలిసెనా
నా తల్లి పోరాట జండెత్తినా
నా తల్లి...............

[హైదరాబాదు జిల్లా అంకుశాపురంలో మే లో, జీతాలు పెంచాలని వ్యవసాయ కూలీలు సమ్మె చేశారు. నాలుగు వందల మంది ఊరేగింపు తీశారు. చరిత్రలో మొదటిసారిగా 'మాపల్లె'లో ఎర్రజెండా ఎగిరింది. జీతగాళ్ళ సమ్మె హక్కునుభగ్నం చేయడానికి, గ్రామంలో భయ భీతావహం (?!) సృష్టించడానికి ప్రభుత్వం పోలీస్ మార్చ్ క్యాంపుల్ని దింపింది. సోదర వ్యవసాయ కార్మికులకు నాచేతులందిస్తూ...]

చీకటోళ్ళం

ఎస్పీ

చీకటోళ్ళం
రేపటోళ్ళం
వర్గశత్రుల చంపెటోళ్ళం

ఎఱ్ఱజెండా నెత్తినోళ్ళం
తుపాకీని పట్టినోళ్ళం
పెత్తనమ్ముల మోసమేమిటో
ఇన్నినాళ్ళుగ చూసినోళ్ళం
పార్లమెంటరి ప్రజాస్వామ్యం
తరచి తరచీ చూసినోళ్ళం
వెర్రిమొర్రీ వెంగళయ్యల
దొంగకూతల నమ్మనోళ్ళం
ఇందిరమ్మ సోషలిజపు
నైజమంతా తెలిసినోళ్ళం

చీకటోళ్ళం
రేపటోళ్ళం
హెచ్చుతగ్గులు మాపెటోళ్ళం

కష్టజీవుల బాధలన్నీ
అనుభవించీ తెలుసుకున్నం
భూమి స్వాముల, ధనికరైతుల
ఆస్తులన్నీ ఆక్రమిస్తం
వడ్డీ జలగల డబ్బునంతా
పల్లె ప్రజలకు పంచిపెడతం
ఓటురాజ్యం కేటునంతా
నేలమట్టం చేసివేస్తం
పేదజాతి అండలోనే
వర్గపోరును నడుపుతున్నాం

చీకటోళ్ళం
రేపటోళ్ళం
కుట్రలన్నిటి తుంచెటోళ్ళం

చారుబాబు అడుగులల్లో
అడుగులేసీ కదిలినోళ్ళం
వెంపటాపు వర్గకసివి
గుండెలల్లో నిలిపినోళ్ళం
సత్యమూర్తి నాయకత్వపు
వెలుగులల్లో సాగినోళ్ళం
మావో సూత్రుల విశ్వసించీ
చైనా బాటలో నడిచెటోళ్ళం
కష్టజీవుల స్వేచ్ఛకోసం
వర్గపోరును నడిపెటోళ్ళం

చీకటోళ్ళం
రేపటోళ్ళం
వర్గశత్రుల చంపెటోళ్ళం.

కుట్ర! (ట్రా)?

ఈశ్వర్

కన్నులు దూస్తై
పెన్నులు రాస్తై
పెన్నుల కన్నులు కుట్ర!(ట్రా)!
కుట్ర- కుట్ర- కుట్ర
ట్ర- ట్ర- ట్ర- ట్ర- ట్ర
క్రూరంగా చప్పుడుచేస్కొంటూ
మెషీన్‌గన్నులో బులెట్లు
రోలవుతున్నై
పెన్నుల కన్నులు పేల్చేద్దామని—
మరి—
ఆ కన్నులు
చెట్టుపీ
పుట్టపీ
గుట్టపీ
సమస్త ప్రకృతిపీనూ—

జైళ్ళలో వాళ్ళు

బి. సూర్యనారాయణరెడ్డి

ఈ దోపిడీ వ్యవస్థ జైలులో
ప్రజలు నంబర్లులేని ఖైదీలు—

విముక్తికోసం పోరాడి
సాయుధ పోరాటంలో
ఊపిరికి దారిచూపి
దాస్యానికి దావానలం అంటించారు
వీరులు

వాళ్ళను తన జైళ్ళల్లోపెట్టి
కొళాయి తిప్పిందీ ప్రభుత్వం
వాళ్ళు ప్రజా పోరాటాల
మహానలం
దాని కేంద్రం
జైళ్ళల్లో కాదు
ప్రజల్లో—

ఏడ్చే అమ్మతో....

మల్లిక్

'నాన్నా! మల్లీ! నీనాన్న లేడు
శైశవంలో నవ్వుల పువ్వులతో నీవు మురిపించిన
పువ్వుల బాటలలో నిన్ను నడిపించిన
నీ ముద్దుల తండ్రి ఇక లేడు
నా ముద్దుల తండ్రీ! నీ నాన్న లేడు
* మేడలు కట్టిస్తావనీ, వాడలు వెలయిస్తావనీ

---

* నేను గొప్ప ఇంజనీరు కావాలని మా నాన్న ఆశ.

విషాదవనాల్లో ఆనంద పుష్పాలే పూయిస్తావనీ
ఎన్నెన్నో బంగరు కలలుగన్న మీ నాన్న
తండ్రీ! నీవు నీ మమకారాలు తెంచుకొని
పీడితజనాల్లో విప్లవాగ్ని ప్రజ్వలనకై
సాహసంతో, సమరదీక్షతో
ప్రజాసముద్రంలో చేరినపుడు
ఎట్టకేలకు భూతగృహంలో చిక్కినపుడు
వృద్ధాప్యంలో మృత్యు గహ్వరంలో చిక్కిన మీ నాన్న
తనయుని ఆవరించిన కష్టాల క్రీనీడలు చూస్తూ
చూస్తూ ఏమీ చేయలేనిస్థితిలో విలపిస్తూ
తన్నుకాదని నిస్వార్థహృదయంతో చీకటి అరణ్యాలు
దహించ ధైర్యంచేసిన గుండెనిబ్బరంపై వింత గర్వంతో
ప్రజల బిడ్డల్ని తల్లి వొడినుండి లాగి
భూతగృహాల్లోకి, మృత్యుసన్నిధిలోకి విసరివేసే
ఈ పోలీసు కుక్కలపై, కోర్టుల నక్కలపై,
విపరీతపు క్రోధంతో ఉడికిపోతూ
మరణ సమయంలో ముద్దుల బిడ్డని చూడలేక విషాదంతో
తన యవ్వనకాలపు సాహసగాథల మననంలో
తనయుని సాహసకృత్యాల్ని మనసారా అభినందిస్తూ
బిడ్డా! మల్లీ! ఇన్నిరకాల ఆవేదనలతో, ఆలోచనలతో
ఉక్కిరి బిక్కిరి అవుతూ మీ నాన్న మరణించాడురా—
నాన్నా! మల్లీ! ఇక లేడు,
నీ నాన్న లేడు.'

* * *

అమ్మా! తల్లీ! రోదించకు,
భర్తృ వియోగంలో తనయుని పరిత్యాగంలో
దిక్కుతోచక గుండెపగిలి రోదించకు
ప్రజారక్తం తాగి కొవ్వెక్కిన ఈ దెయ్యాల గుడినుంచి
శ్రమఫలితం దోచి బలిసిన ఈ భూతాల గృహంనుంచి

త్వరలోనే బయటపడకపోను.
దెయ్యాలకు,భూతాలకు గోరీలుకట్టే
మహత్తర నిర్మాణ కార్యక్రమంలో నావంతు నెరవేర్చకపోను.
జనరాజ్యం వెలసిననాడు, ప్రజాపాలన నెలకొన్నరోజు
జనుల మేడలే కట్టిస్తాను, ప్రజల వాడలే వెలయిస్తాను
మీ బంగరుకలలే పండిస్తాను.
ఈ దోపిడి పులుల పంజా దెబ్బలకు
వికృతంగా తెరిచిన నోటి కోరలకు
బలి అవడమే సంభవిస్తే
నీ కొడుకు వీరమరణం చెందాడని గర్వించు.

పదును

అశోక్‌కుమార్

వాళ్లూ నూరుతున్నామంటున్నారు కత్తుల్ని
ఈ చెట్టున్నరికెయ్యడానికి !
చెట్టు చుట్టూ పాములున్నాయి
బుసలు కొడుతున్నాయి
దగ్గరికెళ్తే కాటేస్తున్నాయి.
అయినా
పాముల్ని చంపనవసరంలేదట
చెట్టున్నరికేస్తారట –
మెట్లులేకుండా మేడ ఎక్కడం లాగ
ఈదకుండా గట్టు చేరడం లాగ!
అందుకు
యింకా నూరుతూనే వుంటారట
హింస రాజ్యంచేస్తున్నప్పుడు
ప్రజల పక్షం కత్తి పట్టడానికి భయపడేవాళ్ళు
శత్రువు కత్తులకు బలికాక తప్పదు.

కథలు :

కళాకారుని కళ

చైనీస్ మూలం : ఫెంగ్ చాంగ్

స్వేచ్ఛానువాదం : చలసాని ప్రసాదరావు

పుపు ఎగిరి గంతేసేడు. అతనికి ఫైవ్‌స్టార్ కంపెనీవారి బ్రష్షులంటే ఇష్టం. చిత్రకళా విద్యార్థిగా ఉన్నప్పట్నుంచీ కూడా అవే వాడుతున్నాడతను. అవి అతని నిత్యజీవితంలో ఓ భాగమయిపోయాయ్. ఆత్మబంధువులయిపోయాయ్

స్థానిక పత్రికవాళ్లా ఉదయం అతనికి కబురు చేసేరు. "ఫైవ్‌స్టార్ బ్రష్షుల ఫ్యాక్టరీలో కువాంగ్ అనే ఓ అమ్మాయుంది. ఆవిడ బ్రష్షుల్ని తయారుజేసే యంత్రం కనిపెట్టిందిట. ఆ యంత్రం మూలంగా ఫ్యాక్టరీలో ఉత్పత్తి ఎనిమిదింతలు అయిందిట. మన పత్రికకోసం ఆవిడ చిత్రం గీసుకురా !" అని.

పుపుకు చాలాకాలంగా ఆ ఫ్యాక్టరీలో బ్రష్షులెలా తయారుచేస్తారో చూడాలనుంది గానీ కుదిరిందిగాదు. వెదకబోయిన తీగ కాలికేతగిలినట్లుగా ఇప్పుడీ అవకాశంవచ్చింది

రంగులూ, బ్రష్షులూ వగైరాలున్న తన పెట్టెను చంకనేసుకుని, కాన్వాస్ భుజాన్న వ్రేలాడేసుకుని పుపు ఆ ఫ్యాక్టరీకేసి బయల్దేరేడు

పత్రిక వారిచ్చిన పరిచయపత్రం చదివి ఫ్యాక్టరీ మేనేజర్ సంతోషించేడు. అతను పుపు పేరు ఆదివరకే విని ఉన్నాడు. అతని చిత్రాలెన్నో చూసి ఉన్నాడు. షేక్‌హ్యాండ్ ఇచ్చి కూర్చోబెడుతూ మేనేజర్ అన్నాడు "కువాంగ్ మా ఫ్యాక్టరీకే గర్వకారణం. మిగతా వర్కర్లకు ఆదర్శం. మీవంటి గొప్ప చిత్రకారునిచేత ఆవిడ రూపం చిత్రింపబడాల్సిందే। ఆ గౌరవానికి ఆమె అర్హురాలే।"

"ఆవిడ ఇక్కడ ఏంపని చేస్తుంటుంది ?" పుపు వాకబుచేసేడు

"మొదట్లో ఆవిడ మామూలు వర్కర్‌గానీ మేమామెకు ఇంజనీరింగులో ప్రత్యేక శిక్షణ ఇప్పించేం."

"ఇంజనీరా ?"

"అవును" పుపుకు టీ అందిస్తూఅన్నాడు మేనేజరు– "ఆవిడ పార్టీ సభ్యురాలు. యూత్ షాక్ టీం నాయకురాలు. సాంస్కృతిక విప్లవకాలంలో మీరామె పేరు వినే ఉండాలి. ఆవిడదృష్టి ఎప్పుడూ క్రొత్త క్రొత్త వాటివి కనిపెట్టటంమీదే. మీకు కొన్ని ఫొటోలు చూపుతానుండండి."

మేనేజర్ తన టేబిల్ సొరుగులోంచి రెండు ఫోటోలు తీసి పుపుకు అందించేడు.

తన మాడల్ రూపంకోసం ఆత్రంగా వాటిని చూసిన పుపు తెల్లబోయేడు. వాటిల్లో ఉన్నది కువాంగ్‌కాదు– అవి ఓ యంత్రం తాలూకు ఫోటోలు.

"ఇది కువాంగ్ టీం తయారుచేసిన బ్రష్షుల యంత్రం." మేనేజర్ ఉత్సాహంగా వివరించసాగేడు– "మా ఫ్యాక్టరీలో తయారయ్యే బ్రష్షులు చాలా నాణ్యమయినవీ, సున్నితమయినవీనూ. వీటిని సాంప్రదాయిక పద్ధతుల్లో చేత్తోనే తయారు చేయవలసి రావటాన ఉత్పత్తి తక్కువా, ఖరీదెక్కువా."

మేనేజర్ ఓ క్షణం ఆగి ఫోటోల్లోకి వ్రేలితో చూపుతూ అన్నాడు "చూడండి! ఈ యంత్రం ఏడెనిమిది మందిచేసే పనిని ఏకకాలంలో చేస్తుంది. మేమీ యంత్రాన్ని అప్పుడే వాడకంలోపెట్టాం కూడా. త్వరలోనే మీకు మా ఫ్యాక్టరీ బ్రష్షులు సగంకన్నా తక్కువ ధరకే అందబోతున్నాయ్."

తను చిత్రించనున్న వ్యక్తిని చూడాలనే ఆత్రంలోఉన్న పుపుకు ఆ ఫోటోలు ఆశాభంగం కలిగించేయి. మేనేజర్ మాటలు ఆసక్తిని రేకెత్తించేయి.

"ఆవిడ వయస్సెంత ?" అనడిగేడతను.

"ముప్పయ్యయిదుకు పైనే ఉంటుందనుకుంటాను. ఆవిడ ముగ్గురు పిల్లలతల్లి"

"ఏం చదివింది ?"

"కొద్ది సంవత్సరాలక్రితం వరకూ నిరక్షరాస్యురాలు. ప్రస్తుతం రాత్రి పాఠశాలలో ఆరోగ్రేడు చదువుతోంది!"

పుపు నిరుత్తరుడయ్యేడు. అతనో హీరోయిన్ని మనసులో ఊహించుకుంటూ వచ్చేడిక్కడికి.

"ఆవిడ అసాధ్యురాలు" మేనేజర్ చిరునవ్వుతో చెప్పసాగేడు. "దేన్నయినా సరే, పట్టుదలతో సాధిస్తుంది. ఈమధ్య కొద్దిరోజుల్నించీ కువాంగ్ ఆవిడబృందం ఈ యంత్రాన్ని ఆటోమాటిక్ మిషన్‌గా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అదే గనుక విజయవంతం అయితే ఈ యంత్రం నిజంగా ఓ అద్భుతమే అవుతుంది"

ఈ పరిచయంతో పుపు మరింత ఆత్రపడిపోయేడు. ఆవిడను చూడాలనీ, ఆవిడ రూపాన్ని చిత్రించాలనీ. గౌరవ, సాహసం మూర్తీభవించిన ఓ యువతిరూపం అతని మనోపథంలో కదలాడింది.

"ఆవిడ ఎక్కడుంటుంది ? ఇప్పుడుగానీ పనివత్తిడిలో ఉంటుందా ?" అనడిగేడు మేనేజర్ని.

"పనివత్తిడా ? ఆవిడకది లేనిదెప్పుడు ? ప్రస్తుతం ఆవిడ తన కొత్త యంత్రాన్ని ఆటోమాటిక్ మిషన్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోంది. అయినా, మీ

కోసం కొంచెం తీరిక చేసుకోగలదనుకుంటాను. మీరు స్కెచ్ వేసుకోవటానికి ఎంతో సేపు పట్టదుగదా!"

మేనేజర్ ఓసారి చుట్టూ కలియజూసేడు "ఎలా ఉందీగది? ప్రస్తుతానికిదే మీ స్టుడియోగా పనికొస్తుందనుకుంటాను. ఆవిడనిక్కడికి పిలిపించమన్నారా?"

"వద్దు! వద్దు!" పుపు వెంటనే వారించేడు. నేనామెను ఆవిడ పనిచేసేచోటనే చూడాలనుకుంటున్నాను. ఆవిడ పనిలో ఉన్నా ఫరవాలేదు. నేను అక్కడికక్కడే పెయింటింగ్ వేసుకోగలను."

"అయితే మరీ మంచిది" అంటూ మేనేజర్ వాచీ చూసుకున్నాడు "ఆవిడ యిప్పుడు డ్యూటీలో ఉండదు. ఈ టైములో ఆమె తప్పకుండా తన లేబరేటరీలో ఉంటుంది." అంటూ టేబుల్‌మీద చిన్నగా చప్పుడుచేసేడు. ఆ వెంటనే ప్రక్క గది లోంచి ఓ యువతి వచ్చింది. మేనేజర్ ఆమెను పుపుకు పరిచయం చేసేడు.

"ఈవిడ పేరు లిన్. మా ఆఫీసు సెక్రటరీ. ఈవిడ మిమ్మల్ని కువాంగ్ వద్దకు తీసుకువెళ్ళి పరిచయం చేస్తుంది." అన్నాడు.

"లేబరేటరీయా? ఎక్కడ ఉందది?" ప్రశ్నించేడు పుపు.

మేనేజర్‌కన్నా ముందే లిన్ అందుకుంది. అది నిజంగా లేబరేటరీకాదు మా ఫ్యాక్టరీ స్టాక్‌రూం అది. కానీ, కువాంగ్‌కు అదే బాగా నచ్చినచోటు. ఫ్యాక్టరీలో అంతకన్నా ప్రశాంతమైన చోటు మరొకటి లేదంటుందామె. తన సహచరులతో తీరిక సమయాల్లో అక్కడే పనిచేసుకుంటూంటుంది. అందుకని మేమా హాలుకు కువాంగ్ లాబరేటరీ అని పేరుపెట్టాం!"

పుపు మౌనంగా లిన్ వెంట ఆ గదివదలి పొడుగాటి వరండాగుండా ఫ్యాక్టరీ ఆ చివరివరకూ నడిచి స్టాక్‌రూం చేరుకున్నాడు. దగ్గరకు వేసిఉన్న తలుపులు కొద్దిగా త్రోసి తల లోపలికిపెట్టి చూసి అంది లిన్ "ఉందండీ! కువాంగ్ ఇక్కడే ఉంది! ఆవిడ టీం అంతా ఇక్కడే ఉన్నారు."

లిన్ తలుపు కొద్దిగా త్రోసి పుపుకు దారిచేసింది. ఇద్దరూ నిశ్శబ్దంగా లోపలికి ప్రవేశించేరు.

అదో పెద్దహాలులా ఉంది. నలువేపులా గోడల కానించిన అలమార్ల నిండా ఏవేవో సామాన్లూ, అవీ సర్ది ఉన్నాయి హాలు మధ్యలో ఓ పెద్ద టేబుల్ ఉంది. దానిమీదకు వంగి నలుగురు యువతులు ఏకాగ్రతతో ఏదో పనిలో మునిగిఉన్నారు. వారిలో ఒకామె చేతుల్లో పెన్సిలూ, సెట్‌స్క్వేరూ ఉన్నాయి. టేబుల్‌మీదున్న డ్రాయింగ్ పేపర్‌మీద ఏవో గీస్తున్నట్లున్నది. మిగిలినవారి దృష్టి ఆ పేపరుమీదే కేంద్రీకరించి ఉంది.

లిన్ కొంటెగా అకస్మాత్తుగా ఈలవేయటంతో అందరూ ఒక్కసారిగా అదిరి పోయి తలలెత్తి చూసేరు.

"అల్లరి పిల్లా! నీవా!" వారిలో ఒకామె లిన్‌ను మందలించింది.

"మమ్మల్ని అదరగొట్టేశావనుకో!" వారిలోకెల్లా చిన్నదిగా కనుపిస్తున్న ఓ పొట్టిజడలమ్మాయి వెక్కిరించింది లిన్‌ను. లిన్‌మీదికి యుద్ధానికిరాబోయి ఆ వెనుకనే ఉన్న అపరిచితుణ్ణిచూసి ఆగిపోయింది.

"అబ్బ! ఎంత పిరికివాళ్లు! మళ్ళీ మాట్లాడితే ఏవేవో యంత్రాలు కనిపెట్టేస్తున్నామంటారు! ఈ మాత్రానికే బెదిరిపోయారా?" అంటూ లిన్ ఆ డ్రాయింగులు గీస్తున్నామెనుద్దేశించి "కామ్రేడ్ కువాంగ్, పని వత్తిడిలో ఉన్నావా? కొంచెం సేపు తీరిక చేసుకోగలవా?" అనడిగింది.

అయితే యీవిడేనన్నమాట తన మాడల్! అనుకున్నాడు పుపు కువాంగ్‌ను చూస్తూ. పొట్టిగా, దృఢంగా ఉందామె. నెత్తిన నీలం రంగు గుడ్డటోపీ వుంది. కురులు అందులోకి ముడిచివేసినట్లున్నది చూపులకు ఏమంత అందంగా గానీ, ఆకర్షణీయంగా గానీ లేదు కానీ ఆవిడ పెదాలమీద సదా వెలిగే మందహాసం ఆవిడికో ప్రత్యేకతను, ఆకర్షణను సమకూర్చుతోంది. ముగ్గురు పిల్లల తల్లిలా కనుపించటం లేదు.

"నాతో పనుందా? మరీ అంత ముఖ్యమా?" అంది కువాంగ్ చేతుల్లోని పరికరాల్ని టేబుల్‌మీదపెడుతూ. ఆవిడ చికాగ్గా ఉన్నట్లు చూడగానే తెలిసిపోతోంది.

"అబ్బే! కువాంగ్‌కు యిప్పుడు తీరికలేదు. మేమిప్పుడో తలనొప్పి వ్యవహారంలోపడి తన్నుకుంటున్నాం. కువాంగ్ యిప్పుడు పనివదలి రావటం కుదరదు" అంది పొట్టిజడలమ్మాయి.

"మీరు రాగూడని సమయంలో వచ్చేరు. మేమీచికాకులో ఏమీ తోచక చస్తున్నాం" అంది వారిలోకెల్లా పొడుగ్గావున్న మరో అమ్మాయి.

కువాంగ్ క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగా ముందుకు వచ్చింది. "ఇప్పుడీపని పూర్తయితేగానీ మాకెవరికీ యీ రాత్రి నిద్ర పట్టేట్లులేదు కామ్రేడ్! అర్ధాంతరంగా పనెలా వదిలిరాను? పోనీ రాత్రికి కలుసుకుందాం. ఇంతకూ పనేమిటో చెప్పవేలేదు" అంది ప్రశ్నార్థకంగా చూస్తూ.

చంకలో సామాన్లపెట్టెతోనూ, భుజాన్న కాన్వాసుతోనూ యింతసేపూ అలాగే నిలబడున్న పుపుకు ఆ వాతావరణం నిరుత్సాహం కలిగించింది. అది గమనించిన లిన్ మరి ఆలస్యంచేయకుండా అసలు విషయం బయటపెట్టింది.

"ఈ కామ్రేడ్ ప్రఖ్యాత చిత్రకారుడు పుపు. ఈయన ప్రత్యేకంగా..."

"చిత్రకారుడా...?" మాట పూర్తిగాకుండానే కువాంగ్ అడ్డొచ్చింది. ఆవిడ వదనంలో ఆందోళన, చికాకు మాయమై సంభ్రమం చోటుచేసుకుంది.

"ఓహ్! ఏమద్భుతం! మనకోసం ఆకాశాన్నుంచి ఆర్టిస్టే ఊడిపడినట్లున్నారే!" అంది పొట్టిజడలమ్మాయి.

"మీ చిత్రాలు మేము చాలా చూశామండీ!" అంది పొడుగమ్మాయి.

పుపు కొంచెం సిగ్గుపడిపోయేడు- "మీరు గర్వించదగిన పనులు సాధిస్తున్నారు" అన్నాడు మాటమారుస్తూ. కువాంగ్‌కేసిచూస్తూ "నన్ను మీ రూపచిత్రం వేసుకురమ్మని పంపేరు పత్రికవాళ్లు" అన్నాడు.

కువాంగ్ సరిగా వినిపించుకున్నట్లు లేదు. మెరుస్తున్న కళ్లతో తనవాళ్లకేసి చూసింది. గ్రహించినట్లుగా పొట్టిజడలమ్మాయి ఓ స్టూల్‌తెచ్చి పుపు ముందువేసింది. పొడుగమ్మాయి ఫ్లాస్కులోని టీ పుపుకు, లిన్‌కు అందించింది.

ఈ సత్కారంతో పుపు తబ్బిబ్బయ్యేడు- "అబ్బే! మీ పనిని పాడుచేసుకోకండి" అన్నాడు మర్యాదకోసం.

"మేమేం పని పాడుజేసుకోవటంలేదు లెండి! పైగా మీరే మాకు యీ పనిలో చాలా సాయం చేయబోతున్నారు" అంది కువాంగ్.

"నేనా...?"

కువాంగ్ మౌనంగా టేబుల్‌మీద పరచివున్న పెద్ద డ్రాయింగ్‌షీట్‌కేసి చూపించింది. దానినిండా ఖాళీలేకుండా ఏవేవో సీలల, మరల, చక్రాల ఆకారాలు చిత్రించి ఉన్నాయ్.

"చూడండి, కామ్రేడ్! మేము మా బ్రష్షులుచేసే యంత్రాన్నిప్పుడు ఆటోమాటిక్ మిషన్‌గా మార్చేందుకు ప్లాను వేస్తున్నాం." కువాంగ్ వివరించసాగింది. "ఆ మిషనూ, దాని భాగాలూ, చక్రాలూ, గేర్లూ అవన్నీ ఎలా వుండాలో మాకు స్పష్టంగానే తెలుసు. కానీ, వాటిని డిజైన్‌చేయటమే మాకెవరికీ చేతగావటంలేదు. మాలో ఎవరికీ డ్రాయింగ్‌రాదు. మా మెకానిక్‌కు సరైన డ్రాయింగులు చూపితేగానీ అతను కావాల్సినవిధంగా పని జరపలేడు, అతనికి ఎంత వివరించినా లాభంలేదు. కాగితంమీద పైజువారీగా చూపవలసిందే."

కువాంగ్ ఊపిరితీసుకుంది. డ్రాయింగ్‌పేపరుమీది బొమ్మలుచూపుతూ అంది. "చూడండీ! వీటిని నేనెంత అధ్వాన్నంగా గీశానో! మీరు చిత్రకారులుగనుక చక్కగా వేసి పెట్టగలరు. దయచేసి వీటిని మా కొలతల ప్రకారం సరైన ఆకారాల్లో వేసి పెట్టండి."

పుపు స్తబ్దుడయ్యేడు. అతను పేరున్న చిత్రకారుడే. ప్రకృతి చిత్రాలువేయటంలో సిద్ధహస్తుడు. ఇటీవల కొంతకాలంగా రూపచిత్రాలు పనిగట్టుకుని చిత్రిస్తున్నాడు వివిధరంగాల్లో విజయాలు సాధించిన శ్రామికుల రూపాలను చిత్రించటంలో ప్రవీణుడుగా ప్రసిద్ధుడయ్యేడు. నవసమాజ నిర్మాతలైన సామాన్యులరూపాల్ని చిత్రించటంలో అతనో ఉత్తేజాన్ని పొందుతూంటాడుకూడా. అతని చిత్రాలనేకం పత్రికలలో ప్రముఖంగా వచ్చేయి. ఇటీవలి కాలంలో అతనెంతో ఎదిగేడు.

కానీ... కానీ... పుపుకు మెకానికల్ డ్రాయింగ్ గానీ, టూల్‌డిజైనింగ్ గానీ ఏనాడూ అలవాటులేదు. ఆ అవసరం అతనికేనాడూ ఎదురయివుండలేదు. ఆ సంగతి వీరికెలా అర్థమయేట్లు చెప్పటం ?

"క్షమించాలి ! నాకీపనిలో అనుభవం ఏమీలేదు నేను బొమ్మలుగీసుకునేవాడినే గానీ డ్రాఫ్ట్స్‌మన్‌నుకాను." అన్నాడు పుపు. వారికి సాయంచేయలేకపోతున్నానే! అన్న బాధతో.

"కానీ మీరు ఆర్టు తెలిసినవారు. మీరలా తప్పించుకోవటానికి వీల్లేదు" అంది పొట్టిజడలమ్మాయి గారాబంగా.

పుపు ఇరకాటంలో పడ్డాడు. తన ఇబ్బందిని వారికెలా వివరించాలో అర్థంగాలేదు. ఆ పేపరు మీది డ్రాయింగులతనికి అయోమయంగా ఉన్నాయ్! "మీరు పొరపడుతున్నారు. నేను ఇంజనీర్ని కాను నాకు ఈ టెక్నికల్ విషయాలేవీ అర్థంగావు. మరి ఎలా చిత్రించగలను" అన్నాడు.

కానీ, కువాంగ్ నవ్వేసింది. "కామ్రేడ్! మేమెవరం ఇంజనీర్లం గానీ! టెక్నిషియన్లంగానీకాము మాకు మాత్రం ఏం తెలుసుగనుక. ఫ్యాక్టరీలో మేంచేసేది బ్రష్షులు తయారు చేయటం. కానీ తీరిక సమయాల్లో మేం మెకానిక్కులుగా, టర్నర్లుగా. కమ్మర్లుగా, వడ్రంగులుగా, మారిపోతుంటాం. మాకిదేమంత కష్టం అనుపించటం లేదే!"

పొట్టిజడలమ్మాయి అందుకుంది. "మేము కాలక్షేపంకోసం ఈ పనులు చేయటం లేదు. సరదాకోసం అంతకన్నాకాదు. ఉత్పత్తుల్లో పాత పద్ధతుల్ని మార్చేసి ఉత్పత్తులు పెంచమని పార్టీ పిలుపిచ్చిందని మీకు తెలుసుగదా ! అన్నింట్లోకీ తాబేలు నడక నడిచేది మా బ్రష్షుల పరిశ్రమే. అందుకని మేమిప్పుడు యంత్రాలు రూపొందించ దలచాం. మాకు అలవాటులేని విషయాలే అయినా నేర్చుకుంటున్నాం" అంది. పొడుగమ్మాయి అంది "కామ్రేడ్! మీరు మెషీన్లను డిజైన్ చేయలేరు, నిజమే కానీ. మీరు శిక్షణ పొందిన చిత్రకారులు గదా! తప్పకుండా మీరు మాకన్న చక్కగా డ్రాయింగులు వేయగలరు."

కువాంగ్ ముందుకువచ్చి అభ్యర్థిస్తున్నట్లుగా అంది. "మీరు మాకీ సాయం చేయక తప్పదు."

వారి ఉత్సాహం, ఉత్తేజం పుపును కదలించేయి. టేబిల్ మీది డ్రాయింగ్ పేపరు కేసి మరోసారి చూసేడు. ఆ తరువాత ఆశగా చూస్తున్న ఆ బృందంకేసి చూసేడు అలవాటులేని పని న్యాయం చేకూర్చగలనా అని తటపటాయించేడు.

కానీ అక్కడ అతన్నొక విషయం కదలించివేసింది. ఈ యువతులు అదివరలో తమకేమాత్రం పరిచయంలేని యంత్రాల విషయంలో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటికే చెప్పుకోదగిన విజయాలు సాధించేరు. ఈ పనిలో వారికెన్ని ఇబ్బందులు, సమస్యలు ఎదురయినా సాహసంతో అధిగమిస్తున్నట్లున్నారు. తమ తీరిక సమయాల్నిలా దేశంకోసం వెచ్చించేస్తున్నట్లున్నారు.

మరి, తన మాటేమిటి? తాను కళాశాలలో సంవత్సరాల తరబడి శిక్షణపొందిన వృత్తిచిత్రకారుడు. తాను వీరికి ఈమాత్రం సాయంకూడా చేయలేనిస్థితిలో ఉండటం...!

కర్చీఫ్ తీసి మొహానికిపట్టిన చెమట తుడుచుకున్నాడు పుపు

కువాంగ్‌కు అతని తటపటాయింపు అర్థమయినట్లున్నది. అయినా ప్రోత్సహిస్తున్నట్లుగా అంది– "మీకు ఎక్కువ టైం లేదేమోగానీ, కామ్రేడ్, ఈ పని ఏమంత ఎక్కువసేపు పట్టదు. మీరు చేసిపెట్టాల్సిందల్లా ఈ నా డ్రాయింగుల్ని నేను చెప్పిన కొలతల ప్రకారం సరైన ఆకారాల్లో స్పష్టంగా ఉండేలా గీసిపెట్టడమే!"

పుపులో నూతనోత్సాహం ప్రవేశించినట్లయింది. ముందుకు కదిలేడు

మరుక్షణం ఆ పరిసరాలన్నీ కలకలలాడిపోయాయ్! ఒకామె రంగులూ, ఇంక్ బాటిల్సూ సర్దసాగింది. మరొకామె క్రొత్త డ్రాయింగ్ పేపర్ తెచ్చి టేబుల్ మీద పరచింది. ఇంకొకామె స్కేలూ, సెట్ స్క్వేర్సూ సిద్ధపరచింది. కువాంగ్ పెన్సిళ్లకు పదును పెట్టసాగింది.

పుపు వారిని ఆపేడు. తన డ్రాయింగ్ సామాన్ల పెట్టెలోంచి తనకు కావాల్సినవన్నీ పైకి తీసేడు.

కువాంగ్ పొంగిపోయింది. ఉత్సాహంతో తన డ్రాయింగుల్ని పుపుకు వివరించసాగింది. "ఇవన్నీ మేమామధ్య మెషీన్ టూల్స్ ఫ్యాక్టరీ చూడటానికి వెళ్లినపుడు అక్కడి ఆటోమాటిక్ లేత్‌నుచూసి కాపీచేసుకు వచ్చేం వీటిని మా బ్రష్షుల తయారీ యంత్రానికి పనికివచ్చేలా మార్పులు చేసుకున్నాం. వీటిని స్కేలు కొలతల ప్రకారం నీటుగా వేయవలసిఉంది!" కువాంగ్ ఊపిరితీసికుంది– "చూడండీ! ఇవి డయాగ్రాంలు, ఇవి ఆటోమాటిక్ కంట్రోల్స్. అయిదుగురి పనినిచేసే స్పెషల్ గేర్లు ఇవి."

కొద్దిసేపట్లో పుపు ఆ క్రొత్త పనికి అలవాటుపడిపోయేడు. క్రమంగా అతని పని వేగాన్నందుకుంది. అతనా డిజైన్లన్నీ ఖచ్చితంగా కువాంగ్ కోరినవిధంగా రూపొందించ సాగేడు ఎన్నడూ లేనంతటి పట్టుదల, ఏకాగ్రత అతన్ని ఆవరించుకున్నాయ్

ఆఖరి డ్రాయింగ్ వేసి, కుర్చీలో సంతృప్తిగా కూలబడిన పుపుకు పొట్టిజడలమ్మాయి ఫ్లాస్కులోని వేడి టీ అందించింది.

"క్షణాల్లో అన్నీ అద్భుతంగా మారిపోయేయి కామ్రేడ్స్!" అంది కువాంగ్ ఉత్సాహంగా।

"మమ్మల్నందర్నీ మీరు ఋణగ్రస్తుల్ని చేసుకున్నారు సుమండీ!" అంది పొడుగమ్మాయి.

పుపు సిగ్గుపడిపోయేడు. వారు ముగ్గురూ తిరిగి ఆ డ్రాయింగుల్ని చూపుకుంటూ ఏమేమో చర్చించుకుంటూంటే అతను తీరిగ్గా చుట్టూచూసేడు.

తననిక్కడికి తీసుకువచ్చిన ఆవిడ ఎప్పుడో వెళ్లిపోయినట్లుంది. తను గమనించనే లేదు. కువాంగ్ తన సహచరుల్తో ఏమో చెపుతోంది. కానీ, ఆ మెషీన్ల భాష తనకు సరిగా అర్థంగావటంలేదు.

టీ త్రాగుతూ ఏకాగ్రంగా వారినే పరిశీలిస్తున్న పుపు కళ్లు మెరిసేయి. అందగత్తె కాదనుకున్న కువాంగ్ అతని కళ్లకు గొప్ప అందంగా గోచరించసాగింది. ఆవిడ నిజ సౌందర్యం అతనికాక్షణంలో పట్టుబడిపోయింది. ఆవిడ కళ్లు విజయోత్సాహంతో వెలిగిపోతూ ఉన్నాయ్! ఆవిడ నుదిటిమీద స్వేదబిందువులు ముత్యాల్లా మెరిసిపోతూ ఉన్నాయ్! ఆవిడ చేతుల్లోని పెన్సిలూ, స్కేళ్లూ, ఆ పరిసరాలూ అన్నీ కలసి పుపు మనోపథంలో ఓ వర్ణచిత్రాన్ని ముద్రించేయి.

అకస్మాత్తుగా పుపుకు తాను అక్కడికెందుకు వచ్చిందీ గుర్తుకు వచ్చింది. మేనేజర్‌తో తానన్న మాటలు గుర్తుకొచ్చేయి.

అతను వెంటనే లేచి చప్పుడుకాకుండా తన స్టూల్‌ను సరైనచోటికి మార్చుకున్నాడు. కాన్వాస్ అందుకుని రంగులు కలుపుకోసాగేడు. చకచకా పని సాగించేడు.

అతనానాడు చిత్రించిన కువాంగ్ రూపచిత్రం పత్రికలో అచ్చయినాక మిత్రులు పుపును అభినందించేరు. అంతకుముందెన్నడూ అంతచక్కని రూపచిత్రం అతను వేసిఉండలేదని.

భోగి - యోగి

'సాహితి'

అనగా అనగా ఒక వూరు. ఊరి కామందుపేరు కామయ్య. ఊళ్ళో సగం పొలాలన్నీ ఆయనవే. ఆయనకి మాగాణం భూములుండేవి. మెట్ట భూములుండేవి. ఇవన్నీ కాక పండ్లతోటలుండేవి. మామిడితోటలూ, జామి తోటలూ, సపోటాతోటలూ కూడా వుండేవి. ఆయన సాటివాళ్ళను మోసం చేస్తూనూ, బీదవాళ్ళను దోపిడీచేస్తూనూ ఆస్తిని పదిరెట్లు పెంచేడు.

కామయ్యకి లేకలేక ఒక మగశిశువు కలిగాడు అతన్ని చాలా గారాబంగా ముద్దుమురిపాలతో పాలువెన్నలతో పెంచేరు కామయ్యా అతనిభార్యా. ఐదేళ్ళు వచ్చేక బడికి పంపేరు. బళ్ళో పంతులు, కామయ్య కొడుకు ఆ వూరి కామందు కొడుకు కాబట్టి ఒంటిమీద చెయ్యివెయ్యకుండా అక్షరాలూ, గుణింతాలూ, ఒంట్లూ ఎక్కాలూ వంటివి మప్పేరు. ఇంతకూ కామయ్య కొడుకుపేరు చెప్పనేలేదుకదూ! అతనికి భోగేశ్వరప్రసాదని నామకరణం చేసేరు. అంత ఆస్తిపాస్తులని అనుభవించటానికి పుట్టిన భోగికి మరోపేరెలా పెట్టగలరు వారు?

పదేండ్ల వయసు వచ్చేప్పటికి భోగేశ్వరప్రసాదు హైస్కూల్లో ఆరోక్లాసులో చేరేడు. హైస్కూల్లో చేరేక మొదటిరోజు స్కూలుకి పంపిస్తూ వాళ్ళమ్మ అతడికి స్నానం చేయించి, మీగడపెరుగూ, అతడికిష్టమైన కూరలతో సుష్టుగా అన్నంపెట్టి, చక్కగా తలదువ్వి, మంచిబట్టలు తొడిగి, అతడిచుట్టూ ఒకసారి దిష్టితీసి "మాబాబు బంగారుబాబు, కలెక్టరౌతాడు" అంటూ బడికి సాగనంపింది కామందు కామయ్యగారి కొడుకు కావటంచేత అతను సులభంగా ఆరు నుంచి ఏడులోకి వెళ్ళేడు. కాని మరి కొన్నాళ్ళకి కామయ్యకి పంతులుగారొక విషయం చెప్పేరు– "మీవాడికి చదువబ్బదు" అని. అందుచేత కామయ్య "నాకొడుకు కలెక్టరై వూళ్ళేలాలా, ఎంచక్కా వూళ్ళేలే కలెక్టర్లనే ఏలగలడు" అనుకొని భోగేశ్వరప్రసాదుని చదువు మాన్పించేడు.

కామందు కామయ్య ఇంటిముందు వాళ్ళ పాలేరు కష్టజీవి కన్నయ్య గుడిసెవేసుకుని వుండేవాడు. కష్టజీవి కన్నయ్యకు భోగేశ్వరప్రసాదు ఈడు కొడుకు వుండేవాడు. వాడిని రాముడు అని పిలిచేవాళ్ళందరూ. ప్రసాదు, రాముడు ఒకే ఈడువాళ్ళు కావటం వలన ఎప్పుడూ కలిసి తిరిగేవాళ్ళు.

ఏవిధమైన శ్రమా లేకపోవటంవలననూ, సోమరిగా వుండటంవల్లనూ, తల్లిదండ్రుల గారాబంవల్లనూ, సిరిసంపదలవలన కలిగిన సౌఖ్యాలవలననూ, భోగేశ్వరునిలో మొదట ఒకవిధమైన విచ్చలవిడితనం ప్రవేశించింది. చిత్రమైన మనస్తత్వం ఏర్పడింది. వూరికినే కూర్చోవటంవలన అతనికి అనేక కోరికలుకలిగేవి. అవన్నీకూడా తల్లిదండ్రులు తీరుస్తుండేవాళ్లు. దాన్నుంచి అతనికొక గాఢమైన అభిప్రాయంఏర్పడిపోయింది. తనకేవస్తువు కావాలన్నా తను కష్టించనక్కరలేదు. చెమట ధారపోయనక్కరలేదు. కూర్చుని అన్నికోరికలూ తీర్చుకోగలడు తను.

పన్నెండేళ్ల వయసప్పుడు భోగేశ్వరప్రసాదు ఒకానొక ఎండాకాలంమధ్యాహ్నం పూట చెలికాడు రాముడితో కలసి యింటికి దగ్గరున్న మామిడితోటకివెళ్ళేడు. మామిడి చెట్లన్నీ పిందెలతో సుమంగళులైన స్త్రీలలా బరువుగా నిల్చున్నాయి మామిడిపిందెలు చూడగానే అవి తినాలనిపించింది భోగేశ్వరుడికి. రాముడికి చెప్పేడాకోరిక. ఇద్దరూ

కలసి రాళ్లువేసేరు. రాళ్ళకి కాయలు రాలకపోవటంతో రాముడు చెట్టెక్కే ప్రయత్నం చేస్తున్నాడు. చేతులు నొప్పెట్టేదాకా భోగేశ్వరుడు రాళ్లు విసిరేదేకాని ఒక్క మామిడి పిందెకూడా సంపాదించలేకపోయేడు. ఈ లోపు రాముడు చెట్టెక్కిపోయి, ఒక కొమ్మమీద కూర్చుని మామిడిపిందె తెంపుకొన్నాడు.

"ఒరేయ్ ! రాముడూ ఒక కాయ కిందపడేయరా" అన్నాడు భోగేశ్వరుడు.

"చెట్టెక్కు. ఎన్నికావాలంటే అన్ని కోసుకోవచ్చు" అన్నాడు రాముడు మామిడి పిందె చర్మంకొరికి వూసేస్తూ.

"ఒక్కటంటే, ఒక్కటిరా"

"ఊహూ, ఎందుకివ్వాలినేను. చెట్టునేనెక్కేను. కాయలు నేను కోసుకుంటాను. కావాలంటే నువ్వూ ఎక్కు" అన్నాడు వాడు పుల్లటి మామిడిపిందెకండ నములుతూ. ఆలోచించి ఆలోచించి తిరుగులేని మంత్రం వుపయోగించేడు ప్రసాదు.

"ఉండు. మా అమ్మకు చెప్తాను" అన్నాడు

రాముడు "ప్రసాదుబాబూ, వొద్దు వొద్దు యివిగో కాయలు" అంటూ మామిడి పిందెలు కిందవేశేడు. కామయ్యభార్యంటే కన్నయ్యకూడా భయపడతాడు. మరిరాముడిదేముంది ? అందుచేత వాడు కాయలు తెంపి పడేశాడు.

మరొకసారి...... ......

ప్రసాదుకి గులాబీలు, ఎర్రవి, ఎంతో చక్కనివి అంటే ఎంతో ఎంతోయిష్టం. వాళ్ళింట్లో గులాబీచెట్టులేదు. వాళ్ళ తోటలోనూ లేదు, వాళ్ళ పక్కింట్లోనూ లేదు. ఆ వూళ్ళో ఒక్క కరణంగారింట్లోతప్ప మరింకెక్కడా గులాబీమొక్క లేదంటే లేదు. అప్పుడప్పుడూ భోగేశ్వరప్రసాదు కరణంగారింటిముందు నుంచుని గులాబీ పువ్వుల్ని చూస్తూ గడిపేవాడు. ఎలాగైనా ఓ ఎర్రగులాబీ తెంపుకోవాలనిపించేది అతనికి. కాని గులాబీమొక్కలముందు చావిడిగుంజకి కట్టేసివున్న పెంపుడుకుక్కనిచూసి చమటపట్టి తిరిగి వచ్చేవాడు.

సరిగ్గా అలాంటి సమయంలో......

ఒకరోజు ప్రొద్దున రాముడు ఒక గులాబీమొక్కని పట్టుకొచ్చేరు. ఒంటికి గుండ్రదనాన్ని, ఓ ప్రత్యేక రూపాన్ని సంతరించుకుంటోన్న పదమూడేళ్ల బాలాకుమారిలా వుందా మొక్క. రాముడు కరణంగారిభార్య చెప్పే చిల్లరమల్లరపనులన్నీ చేసిపెట్టి ఆ గులాబీమొక్కని సంపాదించేడు. రాముడికీ గులాబీలంటే యిష్టమే.

ఆ మొక్కకి ప్రోదిచేసి, నాటి, రక్షణకల్పించి కట్టుదిట్టంచేసేడు. మొక్క కొత్త ఆకులు తొడిగింది. రాముడూ, వాడి చెల్లెలూ గౌరీకూడా దానికి నీళ్లుపోస్తూ, ఆ మొక్కనేచూస్తూ చాలాచాలా ఆనందించేవాళ్ళు. ఆ మొక్క కొత్త ఆకువేస్తేనూ,

కొత్త రెమ్మవేస్తేనూ వాళ్ళిద్దరూ ఎంతో సంబరపడిపోయేవాళ్ళు. అలా దాన్ని వాళ్ళు ఎరువుపోసి, నీరుపోసి, కంటికి రెప్పలా, కన్నతల్లిలా సాకేరు. గులాబీమొక్కకి వయసొచ్చింది. వయసుతోపాటు ఒక్కటంటే ఒక్క మొగ్గతొడిగి సొగసుకూడా తెచ్చుకుంది. గౌరి, రాముడుపొందిన ఆనందానికి హద్దులేదు. వాళ్ళు ఆ మొగ్గవిచ్చేంతవరకూ కళ్ళన్నీ కాయలుచేసుకునిదాన్నే చూసేరు. మొగ్గవిచ్చింది. ఎర్రగులాబీనిచూసేక వాళ్ళ కళ్లు పూలుపూసేయి.

మరి ఆ మొక్క అలా ఎర్రగులాబీ పూయగా, రాముడు గౌరీ కళ్ళుకూడా పూలుపూయగా భోగేశ్వరప్రసాదు కళ్లుమాత్రం నిప్పులుపోసుకున్నాయి. అతని ఎర్రగులాబీపై మక్కువంతా రాముడు, గౌరీలపై అక్కసుగా మారిపోయింది. అతనికా పూవుకావాలి. అతను గులాబీమొక్కని సంపాదించలేడు. పూలు పూయించలేడు. కాని పూవుమాత్రం కావాలి కావాలి......

ఆరోజు రాముడు గౌరిని, గులాబీకి కాపలాపెట్టి అన్నం తినటానికి గుడిసెలోపలికి వెళ్ళేడు. గౌరి... అవును గౌరి ఏమైంది? కామయ్యగారి భార్య కనకమ్మగారు ఏదో పని పురమాయించేరు. మనసంతా గులాబీమీదేవున్నా, గౌరి తప్పక అక్కడనుంచి లేచి వెళ్ళింది.

"ఇదే అదను... ఒకటీ... ఎంతచక్కగా వుంది... ఎంత ఎర్రగా వుంది... గులాబీ... రెండూ... ఎవరూ...ఎవరూ... రాముడూ గౌరీ చూడటంలేదుకదూ... ముళ్ళు... అవును ముళ్ళన్నీ వాళ్ళవి .. పూవుమాత్రం నాది... మూడు... వచ్చిందొచ్చింది. చేతిలో కొచ్చింది గులాబీ పువ్వు... ఎంత మెత్తగా వుంది పువ్వు. ఎంత ఆనందంగా వుంది మనసు... కొబ్బరిలేజు తిన్నట్లుగా... మీగడపెరుగు జుర్రినట్లుగా..."

చేతిలో పూవుతో యింట్లోకి వచ్చివాలేడు భోగేశ్వరుడు. అతనిలో ఒకవిధమైన తృప్తి బయలుదేరి వంకరనవ్వుగా ముఖంమీద బయటపడింది. ఇలా అనుకొనేడతను "పిచ్చివాళ్ళు నెలరోజులు కష్టపడి, చమటకార్చేరు... మనది... ఒకటి, రెండూ, మూడూ... అంతే మూడే సెకన్లు చేతిలో పువ్వువాలింది... అలావుండాలి మనదెబ్బ"

రాముడు కామయ్యభార్య కనకమ్మవలన వుండిన భయంతో భోగేశ్వరప్రసాదుని ఏమీ చేయలేకపోయేడు.

అదీ అలా ప్రసాదుమనస్సులో ఒకముద్ర బలంగాపడింది. కాయలు కావాలంటే చెట్టెక్కనవసరంలేదు. తనకు పూలూ కావాలంటే చెట్లు పెంచనక్కరలేదు గాక లేదు. కాని పూలూ కాయలూ కూడా పొందగలడు.

* * *

పొందగలడుతను. పేకాటలో వేలు పొందగలడుతను కష్టపడకుండా యిష్టా లన్నీ తీర్చుకోగలడుతను కాలం ముందుకుపోతోంది. భోగేశ్వరుడి వయస్సూ ముందుకుపోతోంది. అతని తల్లిదండ్రులుమాత్రం పైకిపోయేరు. అతనిభార్య సీతామహాలక్ష్మి మాత్రం పైకీ, ముందుకూకూడా పోకుండా అడ్డంగా పెరుగుతోంది భోగేశ్వర ప్రసాదుమాత్రం రోజు ఠంచన్‌గా పదిగంటలబస్సుకి పట్నంవెళ్తున్నాడు పేకాడి యిష్టమైనప్పుడు, డబ్బు అవసరమైనప్పుడు యింటికి తిరిగివస్తున్నాడు.

తండ్రికూడబెట్టినకాష్ కాస్తా హుష్‌అన్నట్టు మాయమయింది. మెల్లగా భూములమ్మటం మొదలెట్టేడు. ఈ సంవత్సరం పూరవతల తూర్పుపొలం బేరంపెత్తే, మరుసటిసంవత్సరం పడమటి పల్లపుభూమి అమ్మజూసేడు. భార్య సీతామహాలక్ష్మి మొదట "ఈ ఆస్తి తరిగేదా కరిగేదా, మగమహారాజు, ఏవో సరదాలు, అంతేకాని..." అని సరిపెట్టుకుంది కాని వ్యవహారం బెడిసికొట్టి శ్రుతిమించి రాగానపడటం మొదలెట్టేసరికి భయపడి భర్తకి చెప్పిచూసింది.

"డబ్బుపోతే పోయింది. బంగారంలాంటి తాతలు సంపాదించిన భూములు మాత్రం అమ్మకండి"అని ప్రాధేయపడింది.

"పిచ్చిదానా! చూస్తూవుండు, ఎప్పుడో పట్టుకొస్తాను పోయినదానికి వడ్డీతో సహా. మన నాయుడి బావమరది 'చుక్క' తేడూ, వాడు పేకాటలో యెంత గెలిచేడో తెలుసా —"అంటూ భుజాన కండువావేసుకుని, జేబులో డబ్బువేసుకొని ఎంతగెలిచేడో చెప్పకుండానే పట్నంపోయే బస్సుకోసం పరుగెత్తేడు భోగేశ్వరప్రసాదు.

అతను అలా చాలాకాలం పేకాట, పెద్దదీ, యింకా పెద్దదీ, చాలా పెద్దదీ, అతిపెద్దదీకూడా ఆడి, ఆడి, ఓడి, ఓడి మరింక లాభంలేదనుకుని ఈ ఆట మనఒంటికి సరిపడదనుకుని, కొడ్తే జాక్‌పాట్‌కొట్టాలనుకుని మరికొంత భూమి అమ్మి గుర్రపుపందాలపై దృష్టిమళ్ళించేడు.

మద్రాసు, హైద్రాబాదు, బొంబాయి, బెంగుళూరు, హార్సురేసెస్ ఎక్కడుంటే అక్కడకు గుర్రంలా పరుగెత్తేడు.

భార్య మళ్ళీ చెప్పిచూసింది. భోగేశ్వరప్రసాదుకికూడా ఈమధ్య తన రాబోయే జయంమీద కొద్దిగా అపనమ్మకం కలిగినా ఆశమాత్రం వదులుకోక భార్యకిలాచెప్పేడు "నిన్న పేపర్లో ఏమిటిపడిందో తెలుసా ?"

"ఏమిటిపడింది ?"అన్నట్లు చూసింది సీతామహాలక్ష్మి.

"బొంబాయిలో ఒకతనికి గుర్రపుపందేలలో నలభై ఎనిమిది లక్షలొచ్చినట్లు పడింది. తగిల్తే అట్లాంటిఛాన్సు తగలాలి"అని నలభైఎనిమిదిలక్షలూ గుర్తుకురావ

టంతో. ఆరోజు నిద్రపట్టక గడిపేడు. మరునాడులేచి ఎక్కడో గుర్రప్పందాలంటూ ప్రయాణం మొదలెట్టేడు.

ఆఖరికి మిగిలిన ముసలి మామిడితోట కూడా అమ్మేడు. జాక్‌పాట్ కాదుగదా ఇంట్లో పాట్‌లోకి బియ్యంకూడా దొరకటం కరువైపోయింది. గుర్రానికి పరుగెత్తి పరుగెత్తి కళ్ళేలు పడ్డాయి. ఎంతదూరం వచ్చిందీ అని చూసుకుంటే వెనక్కే పరుగెత్తింది కాని ముందుకి మాత్రం కాదని తెలిసేక, ఏమిచెయ్యాల్సిందీ తోచక ఏమి చెయ్యకుండా వుండేడతను. కాని అప్పులవాళ్ళు మాత్రం ఏమీ చెయ్యకుండా వుండలేదు. వాళ్ళు మిగిలిన స్థిరాస్తులనీ యిల్లు వాకిలీ కూడా స్వాధీనం చేసుకుని భోగేశ్వరప్రాసాదునీ, భార్య సీతామహాలక్ష్మినీ తన్నితగిలేసేరు.

* * *

"అయ్యో పాపం! ఇప్పుడు వాళ్ళు బిచ్చమెత్తుకుంటూ అష్టకష్టాలుపడుతుండాలి."

"కాదు అష్టయిశ్వర్యాలూ అనుభవిస్తున్నారు. శాస్త్రకారుడు చెప్పినట్టు కామిగానివాడు మోక్షకామి కాడన్నట్టు, భోగి కానివాడు యోగికాడని తెలుసుకున్నవాడై, భోగేశ్వరుడు హఠాత్తుగా ఒకరోజున యోగీశ్వరుడయ్యేడు.

పూర్వాశ్రమంలో యోగీశ్వరుడి అనగా భోగీశ్వరుడి మనస్తత్వంగలవాళ్ళు— ఒక్కసారిగా పైకివెళ్ళాలనుకున్నవాళ్లు— ఒక్కసారిగా రెండు ప్రమోషన్లు పొందాలనుకునే ఆఫీసర్లు, మంత్రిపదవులుకోరుకునే రాజకీయవేత్తలు— తమ సినిమాలు బాక్సాఫీసు హిట్సుకావాలనుకునే తారలు. అటువంటివారు యావన్మందీకూడా యోగీశ్వరానందుల వారివద్దకు ప్రవాహంలా వస్తూంటారు. వారందరికీకూడా యోగీశ్వరులవారు తరతమ భేదంలేకుండా కాస్తంత బూడిద పంచిపెట్టి గాడిదల్ని చేస్తుంటారు.

"మరి అలనాటి రాముడో— అతదేమయ్యేడు."

"రాముడు యోగీశ్వరుల పూర్వాశ్రమం అంతాకూడా వివరించిచెప్పి. "వీడు యోగికాడు, భోగిగావుండి, భోగాలుపోగొట్టుకోని, యోగిగామారి మళ్ళీ ఆ భోగాలన్నీ పొందుతున్నవాడేగాని. మహాత్ముడేమీకాద"న్నందుకు యోగీశ్వరుడి శిష్యపరమాణువులు పోషకులు, భక్తులు, పాలకులందరూ రాముణ్ణి "వీడు నాస్తికుడు, విద్రోహి. దేశద్రోహి" అనేరు.

ఆ తరువాత రాముడు యోగులు, భోగులు ఐన రావణబ్రహ్మల రాజ్యంమీద— ఈ రాజ్యంమీదే. దండయాత్ర చెయ్యటానికి దండకారణ్యాలకుపోయేడు.

రాముణ్ణి పట్టుకున్నవారికి పదివేలు బహుమానం ప్రకటించింది ప్రభుత్వం.

ప్రజలదబ్బుని. ప్రజలమనిషిని పట్టుకునేందుకు బహుమానంగా ప్రకటించింది ప్రభుత్వం! అప్పటికీ, ఇప్పటికీ బీదప్రభుత్వానికి పదివేలు బహుమతి యివ్వాల్సిన యిబ్బంది కలుగలేదు.

"విరసంపై కుట్రకేసు ???"

సి. వెంకటకృష్ణ

"విరసం"లోని ప్రముఖ సభ్యులపై ప్రభుత్వం తన సాయుధ సామగ్రిలో వున్న 'పీనల్ కోడ్'లోని బలమైన 'సెక్షన్'లను ప్రయోగించింది. అవి ఏమిటో తెలుసుకునే ముందు 'పీనల్ కోడ్' ముఖ్యమైన స్వరూప స్వభావాలను ఆకళింపుచేసుకోవటం అవసరమవుతుంది.

'పీనల్ కోడ్' రూపొందించి నూరు సంవత్సరాలపైన అయింది. అప్పటినుండి నేటివరకూ 'పీనల్ కోడ్'లో చెప్పదగిన మార్పులు ఏమీ జరగలేదు 'పీనల్ కోడ్' చిత్తు ప్రతి తయారుచేయటానికి అప్పటి 'లా కమీషన్' మొదటిసారి 1834 లో సమావేశమైంది వారిలో ప్రముఖపాత్ర వహించింది 'మెకాలే'. బ్రిటీషు పాలకులు తమ పరిపాలనను పటిష్టం చేసుకోవటానికి అనేక చట్టాలను రూపొందించారు. 857లో జరిగిన భారతీయ సాయుధ తిరుగుబాటుకి మూడుసంవత్సరాల తరువాత 'పీనల్ కోడ్' 1860 లో అమలులోనికి వచ్చింది. పాలకులు మారినా చట్టాలు మారలేదు– వ్యవస్థకూడా మారలేదు.

మొదట చెప్పినట్టుగా దేశంలో నేడు అమలులోఉన్న 'పీనల్ కోడ్' 'English Law of Crimes' అనుసరించే రూపొందించబడింది. ఇంగ్లాండులో రాజును ప్రజలు కూలత్రోసే అవకాశమున్నది అన్న సంగతిని గుర్తించి 'కుట్ర' (Conspiracy) నేరంగా పరిగణించబడినది. అలాగే మనదేశంలోనూ 'బ్రిటిషు' పాలకులపై తిరుగుబాటుచేసే ప్రయత్నాలను వమ్ముచేయటానికే 'కుట్ర'కి సంబంధించిన సెక్షన్ పెట్టబడింది. బ్రిటీషు పాలకుల వారసులైన భారత ప్రభుత్వ పాలకులుకూడా ఆ చట్టాన్ని అమలులోవుంచారు. బ్రిటిషు ప్రభుత్వం పెట్టిన అనేక కుట్ర కేసుల్లో 'లాహోర్ కుట్రకేసు', 'మీరట్ కేసు' ప్రముఖమైనవి నేడు భారత ప్రభుత్వం ఆరోపించిన పార్వతీపురంకేసు, శ్రీనాగిరెడ్డి శ్రీ దేవులపల్లి తదితరులపై హైకోర్టులో నడుస్తున్న కుట్రకేసులకి అత్యంత రాజకీయ ప్రాధాన్యత వుంది. వీటి వివరాలు మరో వ్యాసంలో విపులీకరిస్తాను.

'కుట్ర' స్థూలంగా నిర్వచించుతే, రాష్ట్ర లేక కేంద్ర ప్రభుత్వాలకి ముప్పు వాటిల్లే పనులు, చట్టనిషేధం అయినటువంటివి చేయటం అవుతుంది. కేవలం ఆలోచనవరకు కాకుండా అంగీకారం ఉంటే చాలు. దీనికి ఇద్దరు వ్యక్తులున్నా చాలు.

ప్రస్తుతం విరసం సభ్యులపై ఉన్న కేసు అందిన సమాచారంవరకు కొంత పరిశీలించవచ్చు.

ప్రభుత్వం కోర్టులో దాఖలాచేసిన 'F.I.R.' లో ప్రధానాంశాలు : ఈ కేసుకు సంబంధించిన సంఘటనలన్నీ 18-5-'74కు పూర్వం జరిగినాయిట. ఇదంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే జరిగినదే అని అంటున్నది ప్రభుత్వం. నేరస్థులని చెప్పబడుతున్నవారి సంఖ్య 46 మంది. శ్రీ కె. జి. సత్యమూర్తి, శ్రీ మల్లిఖార్జునశర్మ, శ్రీ కొండపల్లి సీతారామయ్య విరసంలో కొందరు సభ్యులూ వున్నారు ఈ కుట్రంతా న్యూబోయిగూడా, సికింద్రాబాదులో జరిగినట్టుగా ప్రభుత్వం ఆరోపిస్తోంది. దీనిలో ముఖ్యాంశం ఏమిటంటే చట్టరీత్యా యేర్పడివున్న ప్రభుత్వాన్ని, దాని యంత్రాంగాన్ని కూలద్రోయటానికీ, హత్యలు, దోపిడీలు చేయటానికీ, యుద్ధం చేయటానికి నేరస్థులు 'క్రిమినల్ కుట్ర'పన్ని అనేక భయంకర నేరాలు ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో చేశారు అని ప్రభుత్వం అంటోంది.

అయితే విప్లవ రచయితలు యీ కుట్ర కేసులో యెందుకు ఉన్నారు ? వారిపై ఆరోపణలు ఏమిటి ? అని ప్రశ్నిస్తున్నారు.

విప్లవకారులు ప్రకటించిన సాయుధ విప్లవాన్ని సమర్థిస్తూ, ప్రోత్సహిస్తూ 'సృజన' మాసపత్రికలో 'కేడర్'ని సమర్థించినట్టుగా రాసిండట.

'విప్లవ రచయితల సంఘం'లో శ్రీ పెండ్యాల వరవరరావు, చెరబండరాజు శ్రీ ఎం.టి. ఖాన్, శ్రీ త్రిపురనేని మధుసూదనరావు, శ్రీ కె.వి. రమణారెడ్డి యింకా కొందరు (శ్రీ సత్యమూర్తి వగైరాలు) తలపెట్టిన కార్యక్రమానికి చేయూత యివ్వటానికి యువకుల్ని, విద్యార్థుల్ని (పల్లెల్లో) సైద్ధాంతికంగా తయారుచేసే కార్యక్రమం చేపడతామనిన్నూ; ఇంకా అభ్యంతరకరమైన, ఉత్తేజపరిచే విప్లవ రచనలు– ప్రభుత్వం పట్ల ద్వేషాన్ని పురిగొలిపేవి శాంతి భద్రతలను భంగపరిచేవి ప్రజల్ని ఆయుధాలు పుచ్చుకోమని, సాయుధ విప్లవంద్వారా ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి అనువైన రచనలు చేసారు"అని ప్రభుత్వ ఆరోపణ. అంతేకాదు "తుపాకి గొట్టంద్వారానే రాజకీయ అధికారం లభిస్తుంది"అన్న సూక్తి ప్రచారం చేశారని, అనేక సభల్లో సాయుధ విప్లవాన్ని సమర్థిస్తూ ప్రసంగించారుట. "విప్లవ సాహిత్య గోష్ఠి" ముసుగుక్రింద విప్లవ కార్యక్రమాన్ని 'కేడర్'లో ప్రోత్సహించినట్టుగాను, సాయుధ పోరాట సిద్ధాంతాలు ప్రజల్లో వ్యాప్తి చేయటం, ఆయుధాలను దళాలకి సరఫరా అయేట్టుగాచూచే కార్యక్రమం తద్వారా 'ఎర్రభయం' వ్యాపింపచేయటంలాంటివి తలపెట్టినట్టుగా– ప్రభుత్వ ఆరోపణ.

మిగతా వివరాలు తరువాత పరిశీలించవచ్చు. పైన పేర్కొన్న వివరాలను బట్టి 'విప్లవ రచయితలు' 'పీనల్ కోడ్' 124 A సెక్షన్‌క్రింద 'ప్రాసుక్యూట్' చేయబడతారు. 124 A, ని 'Sedition' (రాజద్రోహం) అంటారు. స్థూలంగా అర్థంచేసు

కోవాలంటే ఎవరైనా నోటిమాటలద్వారా లేక దృశ్యనివేదిక లేక మరేయితరపద్ధతుల ద్వారా, చట్టరీత్యా స్థాపించబడిన ప్రభుత్వంపై అయిష్టత కలుగచేసినా, చేసే ప్రయత్నంచేసినా లేక రగులుకొల్పినా శిక్షార్హులవుతారు.

ఈ సెక్షన్ 1837-39 లో 'మెకాలే' రూపొందించిన చిత్తుప్రతిలో 113 సెక్షన్‌కి అనుగుణమైంది. 1860లో ఆమోదించబడిన చట్టంలో 124 A అయింది— దీని ఆధారంగా బ్రిటిషు పాలకులు అనేక తడవులు అప్పటి జాతీయనాయకులపై కేసులుపెట్టారు. శ్రీ బాలగంగాధర్ తిలక్ ప్రాసుక్యూట్ చేయబడ్డాడు. 'రాజకీయ అభిప్రాయాలు, ఆశయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యక్తపరిచారు'అన్న ఆరోపణ ఆధారంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 'విరసం'లోని కొందరు ముఖ్యసభ్యుల్ని 'ప్రాసిక్యూట్' చేస్తున్నది. రాజ్యాంగచట్టంలో ఆర్టికల్ 19 కింద యిచ్చిన వాక్‌స్వాతంత్ర్యానికి ఎంత విలువున్నది అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

లోగడ శ్రీ జ్వాలాముఖి, శ్రీ చెరబండరాజు, శ్రీ నిఖిలేశ్వర్‌ని (1971)లో, రెండవసారి శ్రీ వరవరరావు, శ్రీ చెరబండరాజు, శ్రీ ఎం.టి. ఖాన్‌ని (1973)లో (MISA) మీసాకింద అభ్యంతర రచనలు చేసినందుకు ప్రభుత్వం నిర్బంధించింది. హైకోర్టు, ప్రభుత్వ ఆరోపణలను త్రోసిపుచ్చి 'విరసం' రచయితల్ని విడుదలచేసింది. విరసం నిషేధింపబడలేదు. కొన్ని పుస్తకాల్ని నిషేధించింది. ఈ కేసులో ఈవిషయాల ప్రభావం ఉందా? విప్లవ రచన అని దేన్ని అంటారు? మార్క్స్-లెనిన్ రచనలు ఏమిటి? ఈలాంటి ప్రశ్నలగురించి ప్రజలు ఆలోచిస్తున్నారా? పౌరహక్కుల సమితి దృక్పథం ఏమిటి? పౌరహక్కులు అంటే ఏమిటి?

వీటన్నిటిదృష్ట్యా ఆలోచిస్తే యీ 'కుట్ర' కేసుకి ఎంతో ప్రాధాన్యత వుంది. విరసం సభ్యుల్లో ప్రముఖులైన శ్రీ త్రిపురనేని మధుసూదనరావు, శ్రీ కె.వి. రమణారెడ్డి, శ్రీ వరవరరావుగారు, శ్రీ చెరబండరాజు, శ్రీ ఎం.టి. ఖాన్, 'పిలుపు' ఎడిటర్ శ్రీ రంగనాథంగార్లు ఉన్నారు. ఈ కేసు ఎప్పటికి తేలుతుంది అంటే "సారీ" కాలపరిమితి అంటూ చట్టంలో లేదు.

"విశ్వాసాలు అదుపులో పెట్టబడేవి కావు— ఎవర్నీ అతనికున్న విశ్వాసాల గురించి జైల్లో పెట్టడానికి వీలులేదు."

— జస్టిస్: ఓ. చిన్నపరెడ్డి
జస్టిస్: ఎ.డి.వి. రెడ్డి

సికిందరాబాదు కుట్రకేసు–
పోలీసు ప్రాసిక్యూషన్ ఆరోపణలు

'సికిందరాబాదు కుట్రకేసు' గా పిలువబడుతున్న కేసులో 46 మంది నిందితు లున్నారు. ఇది హైదరాబాదులోని సెంట్రల్ క్రైం స్టేషన్ నమోదుచేసిన కేసు. రాష్ట్ర ప్రభుత్వానికీ మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీ నాయకుడు కె. జి సత్యమూర్తి మధ్యన (State Vs K.G. Satyamurthy) నడుస్తున్న కేసు. ఈ కేసు ప్రత్యేకత ఏమంటే కె. జి సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్య, ఇంగువ మల్లికార్జునశర్మ, బర్ల యాద గిరిరాజు, లింగా విజయకుమార్ వంటి మార్క్సిస్టు-లెనినిస్టు నాయకులతోపాటు విప్లవ రచయితలను, సానుభూతిపరులను కూడా ఈ కేసులో చేర్చారు. ఈకేసును పురస్క రించుకొని ఇప్పటికి అరెస్టయిన 11 మంది 'నిందితులు' 10వ మెట్రోపాలిటిన్ మెజి స్ట్రేట్ కోర్టులో బెయిలుకోసం పిటీషన్లువేసిన సందర్భంలో పోలీసు ప్రాసిక్యూటర్ చేసిన ఆరోపణలను ఈక్రింద ఇస్తున్నాం. ఈమేరకు ఇది విప్లవ రచయితల సంఘంపై 'కుట్ర కేసు' గా కనిపిస్తున్న దరిమిలా ప్రధానంగా వారికి సంబంధించిన ఆరోపణలే ఇస్తున్నాం. (అప్పటికి కె. వి. రమణారెడ్డికోసం బెయిలుపిటిషన్ వేయలేదు నింద తుల్లో రెండు గ్రూపులున్నాయని, మొదటివారు రచయితలు, రెండవవారు కార్యకర్త లని ప్రాసిక్యూటర్ వాదించాడు. ప్రధానాంశాలివి :

"కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాన్ని కొనసాగించేక్రిమంలో, చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని సాయుధ విప్లవంద్వారా పడగొట్టే కార్యక్రిమంలో భాగంగా దోపిడీలు, హత్యలు, యింకా యితర హింసాత్మకచర్యలద్వారా యీ నిందుతులు పథకం వేశారు. సాయుధపోరాటాన్ని ఆచరించడానికి యీ నిందుతులు విప్లవ రచయితలను, వారివంటి భావాలుగలవారిని బలపరిచారు. కార్యకర్తలను చేర్చారు. సాయుధ గెరిల్లాదళాలను నిర్మించారు. వాళ్ళకు ఆయుధాలందించారు. తమ పేర్లు బయటపడకుండా మారుపేర్లు పెట్టుకున్నారు. రహస్య స్థావరాలు యేర్పాటుచేశారు. హింసాసిద్ధాంతాన్ని వ్యాపింప చేసారు.

వరవరరావు, చెరబండరాజు, ఎం.టి. ఖాన్, కె.వి. రమణారెడ్డి, రంగనాథం, మధుసూదనరావు యితర సహచరులతో కలిసి 'విరసం' అనేపేరుతో ఆగస్టు 1970 లో సాయుధ విప్లవాన్ని ప్రేరేపించి ప్రచారంచేసే లక్ష్యంతో ఒక సంస్థను స్థాపించారు. ఈ లక్ష్యాన్ని విద్యార్థులు, నిరుద్యోగులైన యువకులు, ప్రభుత్వ యంత్రాంగంలో రెండు ప్రదానఅంగాలైన క్రిందితరగతి పోలీసు, సైనిక ఉద్యోగుల్లో హింసాత్మక చర్యలను రెచ్చగొట్టడంద్వారా సాధించదలిచారు. ఈ నిందితులు ఖమ్మంజిల్లా ఇల్లెందుతాలూకా

మద్దివంచగ్రామంలో '71 సెప్టెంబరులో ఒక రహస్య సమావేశంకూడా జరుపుకున్నారు. తీవ్రమైన కార్యక్రమాలు చేపట్టడానికి, ప్రభుత్వాన్ని పడగొట్టడానికి, ఎర్ర సేనను నిర్మించుకొన్నారు. విప్లవసాహిత్యాన్ని ప్రచారంచేయడానికి నిర్ణయించుకున్నారు. తమ సమష్టి లక్ష్యాన్ని సాధించడానికి యీ నిందితులు 12-10-'71 నుంచి 18-1-'74 దాకా ఖమ్మం, వరంగల్, నల్లగొండ, మెదక్ జిల్లాలలో హత్యలు, దోపిడీలు, పోలీసు స్టేషన్లపై దాడులు, ఆయుధాలు లాక్కోవడంవంటి నేరాలు ఎన్నో చేసారు.

(ఇవి 11 మందిమీద, బహుశా 46 మందిమీద సాధారణంగావున్న ఆరోపణలు)

విడివిడిగా విప్లవ రచయితలమీద ఆరోపణలు ఇలావున్నాయి.

వరవరరావు :- ప్రభుత్వాన్ని హింసాత్మక చర్యలద్వారా పడగొట్టాలన్న సాధారణమైన కొనసాగుతున్న కుట్రలో భాగంగా స్థాపించబడ్డ 'విరసం' కార్యవర్గ సభ్యుడు, 'సృజన' మాసపత్రిక ప్రింటర్, ఎడిటర్. రెచ్చగొట్టే జ్వలనస్వభావంగల బోధలతో ఈ పత్రిక వర్గద్వేషాన్ని, ప్రభుత్వంపట్ల అసంతృప్తినీ సృష్టిస్తూ ప్రజలమధ్య సామరస్యాన్ని నిర్వహించడానికి భంగకరంగావున్నది.

ఈ కుట్రకేసు నిర్వహించడానికి పాఠకులను, కేడరును, ఆయుధాలు అందుకొని ప్రభుత్వాన్ని పడగొట్టవలసిందిగా ఇతడు తీవ్రమైన రచనలు 'సృజన'లో ప్రచురించాడు. మార్చి '71, మే, జూన్ '72 సృజన సంచికలను ప్రభుత్వం అందుకే నిషేధించింది.

'విరసం' సభ్యుడుగా విద్యార్థుల్లో హింసాత్మక సిద్ధాంతాన్ని ప్రవేశింపజేయడానికి ఆయుధాలు చేపట్టమని మిలిటెంట్ క్యాడర్‌ను ప్రోత్సహించడానికి 'స్టడీసర్కిల్' పేరుతో మధిర ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఈ కేసులో నిందితులైన రోశయ్య, కోటేశ్వరరావులతో కలిసి 30-9-'72 న ఒక రహస్య సమావేశం ఏర్పాటుచేశాడు. స్కూళ్ళల్లో, కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సిలబసులో నిర్ణయించిన పాఠాలను చెప్పవద్దని బదులుగా యువకుల్లో హింసాసిద్ధాంతాన్ని ప్రచారంచేసి, ద్వేషాన్ని సృష్టించి మావో ఆలోచనల్లో చెప్పబడినట్లుగా సాయుధ విప్లవాన్ని తేవడానికి ప్రేరేపించవలసిందిగా కోరాడు విద్యార్థులను స్కూళ్ళకు, కాలేజీలకు వెళ్ళవద్దని, ఆయుధాలు తీసుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడమని, ప్రభుత్వాన్ని హింసాత్మక చర్యలద్వారా పడగొట్టే కుట్ర లక్ష్యాన్ని సాధించడానికి పోరాటప్రాంతాలకు వెళ్ళవలసిందని కోరాడు. ఈ నిందితుడు లెక్చరర్ కాబట్టి యువకులమీద, ఉపాధ్యాయులమీద, దీర్ఘకాలిక ప్రభావం వేయడంలో కృతకృత్యుడయ్యాడు. ఈ నేరాత్మక కుట్ర లక్ష్యాలను ప్రచారం చేయడానికి రాష్ట్రం నలుమూలలా ఎన్నోసభల్లో మాట్లాడాడు. హింసాసిద్ధాంతాన్ని బహిరంగంగా బలపరిచాడు, ప్రచారంచేసాడు. చట్టబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రజలను, ముఖ్యంగా యువకులను ఆయుధాలు అందుకొమ్మని రెచ్చగొట్టాడు.

చెరబండరాజు :— విరసం కార్యవర్గ సభ్యుడుగా, అంటే కుట్రలో సభ్యుడుగా జ్వలనాత్మకమైన, రెచ్చగొట్టే కవితను, 'మళ్ళీవస్తున్నాయి మన ఊరికి' అనే పేరుతో మార్చ్ '72 సృజనలో రాసాడు. ఈ సంచిక నిషేధించబడింది. ఇంకొక పుస్తకం 'ఇప్పుడువీస్తున్న గాలి' (విరసం ప్రచురణ)లో కథరూపంలో ఒక రచనచేసాడు. ఇది ప్రభుత్వంపట్ల అసంతృప్తిని రెచ్చగొట్టి సామరస్యాన్ని నిర్వహించడానికి భంగకరంగా వున్నది. ఇది ప్రభుత్వంచేత నిషేధింపబడ్డది. ఈ నేరాత్మక కుట్ర లక్ష్యాలను ప్రచారంచేయడానికి రాష్ట్రంలో ఎన్నోచోట్ల సభల్లో ఇతడు ఉపన్యాసాలిచ్చాడు. 'కలం మాది, కత్తి మీది' అనే నినాదంతో ప్రజలను ఆయుధాలు తీసుకుని ప్రభుత్వంమీదికి విప్లవించమని రెచ్చగొట్టాడు. మరీ ఇటీవలనే 3-8-'74న హైదరాబాదు కార్యవర్గ కమిటీ ప్రేరేపిత స్వభావంగల మాటలతో ఒక కరపత్రం వేసింది. ప్రజలను ఆయుధాలందుకుని ప్రభుత్వాన్ని బుల్లెట్లతో కూల్చమని డిమాండ్ చేసింది. ఇది సాధారణమైన, కొనసాగుతున్న నేరాత్మక కుట్రయొక్క లక్ష్యమే. ఇట్లా యీ నిందితుడు ప్రభుత్వాన్ని హింసాత్మక విధానాలద్వారా పడగొట్టాలనే చట్టవిరుద్ధ లక్ష్యంతో ఏర్పడిన నేరాత్మక కుట్రలో సభ్యుడు.

ఎం.టి. ఖాన్ :— 'పిలుపు' పక్షపత్రిక పబ్లిషర్, ప్రింటర్, 'విరసం'కార్యవర్గ సభ్యుడుగా నేరాత్మక కుట్రలో చేరి, ఉక్కిరిబిక్కిరి జ్వలనాత్మక స్వభావంగల రచనలు 16-11-'72, 1-4-'73 పిలుపు సంచికల్లో ప్రచురించాడు. ప్రభుత్వం యీ సంచికలను నిషేధించి స్వాధీనంచేసుకున్నది. ఈ కుట్ర లక్ష్యాలను ప్రచారం చేయడానికి రాష్ట్రంలో నలుమూలలవున్న యీ క్రింది ప్రాంతాల్లో సభల్లో మాట్లాడు. 1) 20-5-73 అనంతపురం. 2) 9-8-73 సికిందరాబాదు 3) 7-10-73 వరంగల్. 4) 18-11-73 ఖమ్మం. 5) 20-12-73 బొగ్గులకుంట, హైదరాబాద్. ఈ అన్ని సమావేశాల్లోకూడ ఈ నిందితుడు విద్యార్థులను, నిరుద్యోగులైన యువకులను, మిలిటెంట్ క్యాడర్‌ను, యిలాంటి భావాలుగల ప్రజలను ఆయుధాలు తీసుకుని సాయుధపోరాట కార్యక్రమంలో చేరమని రెచ్చగొట్టాడు.

1 అక్టోబర్ '73 'పిలుపు' సంచికలో ప్రచురింపబడిన ఒక కవితలో శ్రీకాకుళ పోరాటప్రాంతంలోనూ, యితరచోట్లా సేకరించిన అయుధాలను అందుకొని సాయుధ పోరాటాన్ని నిర్మించి ప్రభుత్వాన్ని హింసాత్మకంగా పడగొట్టాలని వర్ణించబడింది. ఈ కవితలో గార్ల రైల్వేస్టేషన్‌లో గుంజుకోబడిన రైఫిల్ గురించి ప్రత్యేకంగా పేర్కొనబడింది. ఇది ఒక ట్రాలీలో పోతున్న రైల్వే రక్షక్‌ను కాల్చిచంపి అతనివద్దనుంచి పెద్దమొత్తం దోచుకోబడిన ఉదంతానికి సంబంధించింది. ఈ కవిత ప్రచురింపబడిన "పిలుపు" నక్సలైట్ దళం నాయకుడు బర్ల యాదగిరిరాజు (ఈకేసులో నిందితుడు)వద్ద మహబూబాబాదు... సూర్యాపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో దొరికింది.

హైదరాబాదు 'విరసం' నగరశాఖ మరీ ఇటీవలనే 3-3-'74 న ఒక కరపత్రం వేసింది. ఈ నిందితుడు అందులో కార్యవర్గ కమిటీ సభ్యుడు. ఆ కరపత్రంలో చాలా ప్రేలే స్వభావంగల మాటలున్నాయి.

ఎం. రంగనాథం :- 'పిలుపు' పక్షపత్రిక సంపాదకుడు. ('పిలుపు'కు సంబంధించినంతవరకూ ఖాన్‌పై ఆరోపణలే ఇతనికి వర్తిస్తాయి) ప్రభుత్వాన్ని హింసాత్మక పద్ధతులద్వారా పడగొట్టాలనే కుట్ర లక్ష్యాలను ప్రచారం చేయడానికి యీ నిందితుడు సభల్లో మాట్లాడి విద్యార్థులను, నిరుద్యోగ యువకులను, మిలిటెంట్ క్యాడర్‌ను, అలాంటి భావాలుగల ప్రజలను ఆయుధాలు తీసుకుని సాయుధ పోరాట కార్యక్రమంలో చేరమని చెప్పగొట్టాడు.

టి. మధుసూదనరావు :- లెక్చరర్, గోవిందరాజుల కాలేజీ, తిరుపతి 'విరసం' ప్రధాన కార్యదర్శి. ఈ నిందితుడు 10-1-'73 రోజు మద్దిపంచలలో ఏర్పాటు చేయబడిన రహస్య సమావేశంలో వరవరరావుతోపాటు పాల్గొన్నాడు. "విప్లవ సాహిత్య గోష్ఠి" ముసుగుతో యేర్పాటు చేయబడిన సమావేశంలో నక్సలైట్ నాయకులుకూడా పాల్గొన్నారు. యువకులను ఆయుధాలుతీసుకొని ప్రభుత్వాన్ని హింసాత్మకచర్యలద్వారా కూలద్రోసి సాయుధ పోరాటాన్ని ఆచరించవలసిందిగా రెచ్చగొట్టాడు. ఈ మీటింగ్ ప్రేరణవల్లనే యీ కేసులో నిందితుడు ఎం. రామచంద్రయ్య (భాస్కర్) మహబూబాబాద్ తాలూకా వెంకటాపురం భూస్వామిని హత్యచేసాడు. నడిగూడెం బ్యాంక్ దోపిడీ యీ మీటింగ్ ప్రోత్సాహంతోనే జరిగింది.

ఇతడు విద్యార్థులను, నిరుద్యోగులైన యువకులను, యిలాంటి భావాలుగల ఇతరులను ఆయుధాలుతీసుకుని ప్రభుత్వానికివ్యతిరేకంగా విప్లవించమని రెచ్చగొట్టాడు. "కలం మాది, కత్తి మీది"వంటి ప్రమాదకరమైన నినాదాలు యిచ్చి కలంద్వారానూ, కత్తిద్వారానూ హింసాత్మక చర్యలను రెచ్చగొట్టాడు.

3-3-'74 న హైదరాబాదు 'విరసం' యూనిట్ ప్రధాన కార్యదర్శిని సంప్రదించి చాలా అభ్యంతరకరమైన (పైనపేర్కొన్న) కరపత్రాన్ని ప్రచురించింది

పైనపేర్కొనబడిన విప్లవ రచయితలు కాక వీరితోపాటు ఈ కేసుగురించి అరెస్టయినవారిమీదకూడా "విరసం" తో సన్నిహితంగా వున్నారన్నది ఒక ప్రధానమైన ఆరోపణ.

భారత చైనా మిత్రమండలి (ఖమ్మం) ప్రధాన కార్యదర్శి, ఖమ్మం జిల్లా పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడైన వాసిరెడ్డి కోటేశ్వరరావు "విప్లవ సాహిత్య గోష్ఠి" పేరుతో 15-1-'73న మీనవోలు గ్రామం (ఖమ్మం జిల్లా)లో జరిగిన రహస్య మీటింగ్ 'సహకుట్రదారుడు'గా ఆరోపించబడింది.

ఖమ్మం చారుమజుందార్ బుక్‌స్టాల్‌కుచెందిన బి. మల్లయ్యకూడా పై సాహిత్య గోష్ఠిలో పాల్గొన్న 'సహకుట్రదారుడే' "ఈ నిందితుడు వరవరరావు, చెరబండరాజు, ఎం.టి.ఖాన్‌లతో సన్నిహితంగా సంబంధాలు కలిగివుండేవాడు. 'చారుమజుందార్ బుక్

స్టాల్' ద్వారా విప్లవసాహిత్యాన్ని ప్రచారంచేసాడు. (విద్యార్థుల్లో, యువకుల్లో) ఇతనిని అరెస్టుచేసినప్పుడు ఇతనివద్ద 'సృజన' 'పిలుపు' 'ఎరుపు' వంటి విప్లవసాహిత్యం, కరపత్రాలు, మొదలైనవి దొరికినవి." అన్నది ఒక ఆరోపణ.

కె. నారాయణరెడ్డి :— "సి.కె.ఎం. కాలేజ్ విద్యార్థి. అక్కడే వరవరరావు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు స్వగ్రామమైన పెదముప్పారంలో యువజన సమాఖ్య అనే పేరుతో ఒక సంఘాన్ని స్థాపించి దానిద్వారా 'సృజన', 'పిలుపు' వంటి విప్లవ సాహిత్యాన్ని ప్రచారంచేశాడు" అన్నవి అరోపణలు.

* * * * *

ఈ క్రింది కొన్ని వాస్తవాలతో పై ఆరోపణలను పోల్చుకుని మొత్తంగా యీ ఆరోపణలే ఎట్లా విప్లవానికి, విరసం కు వ్యతిరేకంగా కుట్రో ఆలోచించండి.

❶ 'విరసం' '70 జులై 4 న హైదరాబాదులో స్థాపించబడింది. అధ్యక్షుడు శ్రీ శ్రీ, ఉపాధ్యక్షులు కొ.కు, రావి.శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కె.వి ఆర్, జ్వాలాముఖి, నిఖిలేశ్వర్, చెరబండరాజు, నగ్నముని, వరవరరావు కార్యవర్గంగా అడ్‌హాక్ కమిటీ ఏర్పడింది. '70 అక్టోబర్‌లో ఖమ్మం పాణిగ్రాహి నగర్‌లో జరిగిన ప్రథమ మహాసభలో పైవారే ఆయాపదవులకు ఎన్నికయ్యారు. కార్యవర్గం మాత్రం విస్తరించబడింది. '72 అక్టోబర్‌లో గుంటూరులో జరిగిన తృతీయ మహాసభలవరకుకూడా త్రిపురనేని మధుసూదనరావు 'విరసం' సభ్యుడుకూడా కాదు. రంగనాథం యీనాటికీ విరసం సభ్యుడు కాడు. 'పిలుపు' పత్రిక ప్రారంభించింది 1972 ఆగస్టులో.

❷ మద్దివంచ గ్రామం ఎక్కడుందో యీనాటికీ యీ కేసులోవున్న రచయితలకెవరికీ తెలియదు.

❸ 'స్టడీ సర్కిల్' అన్నది మధిర జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ విద్యార్థుల కోసం యేర్పాటుచేసిన ఒక వికాసవేదిక. అందులో రహస్యమేమీలేదు. వందలమంది విద్యార్థులు పాల్గొన్న బహిరంగ సమావేశం. ఎందరో సాహిత్యవేత్తలు ఆ వేదికమీద మాట్లాడారు 30-9-'72 రోజు యిందులో వరవరరావుతోపాటు వేగుంట మోహన ప్రసాద్‌కూడ మాట్లాడాడు.

❹ డిసెంబర్ 20, '73 బొగ్గులకుంట ఆంధ్ర సారస్వత పరిషత్ హైదరాబాద్ నగర పౌరహక్కుల సభలో ఎం.టి. ఖాన్ మాట్లాడలేదు—

❺ మీనవోలులో జరిగిన 'సాహిత్యగోష్టి' గాని, బహిరంగసభగాని పబ్లిక్‌గా జరిగినవేగాని రహస్య సమావేశాలు కావు. ముందుగా కరపత్రాల వేసి, ప్రచారంచేసి పోలీసు పర్మిషన్‌కూడా తీసుకొని, మైకులు, లౌడ్‌స్పీకర్లుపెట్టి జరిపిన సభలు. 'సాహిత్యగోష్టి'లో వందలసంఖ్యలో బహిరంగసభలో వేలసంఖ్యలో జనులు పాల్గొన్నారు. తమ ఉపన్యాసాలు వినడానికి ఎవరు రావాలో ఎవరు రావద్దో 'విరసం' విధినిషేధాలు కట్టడిచేయలేదు.

రచయితలకు వ్యతిరేకంగా ప్రభుత్వ షడ్యంత్రం:

(యువపోరాటంనుంచి)

విజయకాంత్

ఇప్పటికి రెండుసార్లు విరసం సభ్యులను పిడి, మీసాలవంటి ఫాసిస్ట్ చట్టాలకింద ప్రభుత్వం జైల్లో పెట్టింది. ఆలోచనలను అభివ్యక్తీకరించడమూ, రచనా చట్టవ్యతిరేకమూ శాంతిభద్రతలకు భంగకరమూ అని భయపడే ప్రభుత్వం ఈసారి రచయితలు కుట్రచేస్తున్నారని ఆరోపించి తన ఫాసిస్టు ప్రజావిరోధ స్వభావాన్ని బయటపెట్టుకున్నది. ఇది స్పష్టంగా రచయితలకు వాళ్ళ ప్రజాకళలకు వ్యతిరేకంగా ప్రభుత్వం పన్నినకుట్ర. ఇందులో విరసం రచయితలపై హత్య, దోపిడీ, సాయుధంగా ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం— వంటినేరాలు మోపబడినవి. ఈవిధంగా ప్రజలనుంచి నిజం చెప్పడం, రాయడం, ప్రొటెస్టు చేయడంవంటి హక్కులను అపహరించి ప్రభుత్వం క్రాంతికారులు మరో అడుగు ముందుకువేసేలా చేసింది। దీన్నుంచి దేశంలోని రచయితలు గుణపాఠం తీసుకోవాల్సివున్నది. ఇలాంటివి దేశంలో అంతటా జరుగుతూనే వున్నాయి. సామాన్య పీడిత జనుల సమస్యల్ని వాళ్ళ కన్నీళ్ళను, కష్టాలను, పోరాటాలను తన రచనలలో చిత్రించే ప్రతిరచయితకూ యిది ఎదురవుతుంది. ప్రభుత్వ దుష్కృత్యాలను బలంగా ఎదురించి గట్టి దెబ్బ తీయగల దమ్ము శ్రామికవర్గ రచయితల కలాలకున్నది. కాని ఒకవేళ యీ దేశంలో రచయితల సంయుక్త ప్రతిఘటన ఏర్పడకపోతే, ఏదేని ఒక భయంకరమైన రాత్రి నిరీహ లేఖకుణ్ణి అతని యింటినుంచి ఎత్తుకపోయి 'ఏకాంత సంఘర్షణ'లో తూటాతో ఎగురగొట్టి పోలీసులు సాహిత్యాన్ని సంరక్షించవచ్చు. అప్పుడతని గొంతు సాహిత్యానికొక శబ్దాన్నికాని, ప్రజలకొక సందేశాన్నికాని అందించలేదు. ఈ ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా ప్రతిచోట సభలు, ఊరేగింపులు, ఖండనలు, రచనలు చేయాలని రచయితలను కోరుతున్నాను. ఇది చాల అవసరం.

శిశు హంతక రాజ్యం ఇది
పశుసంతతి పాలన ఇది
స్వేచ్ఛాజీవుల రక్తం మాంసం
యథేచ్ఛగా తినమరిగిన రక్కసి
శిరచ్ఛేదమే మన కర్తవ్యం

దానికిమించిన ధర్మం శూన్యం
జైలుగోడలలో వేళ్ళుతన్నుకొని
గడ్డిపోచలూ గర్జించాలి
జనకంటక రాజ్యాంగాన్ని
తుదకంటా నరికెయ్యాలి

— చెరబండరాజు

సికిందరాబాదు కుట్రకేసు వార్త:

కోర్టులో నినాదాలు - పాటలు విప్లవ ప్రచారం

విప్లవ రచయితలను, వాళ్ళ సానుభూతిపరులను, మొత్తం 11 మందిని ఇప్పటికి రెండుసార్లు (1, 14 జూన్) కోర్టులో హాజరుపరిచారు. ఈ రెండు అవకాశాలనుకూడా జైలు నుంచి కోర్టుదాకా, కోర్టు నుంచి జైలుదాకా దారిపొడుగునా, కోర్టు ఆవరణలో విప్లవభావ ప్రచారం చేయడానికి తమ శక్తి మేరకు వీళ్ళు వినియోగించుకున్నారు.

'విప్లవం వర్ధిల్లాలి!' 'విప్లవ రచయితల సంఘం వర్ధిల్లాలి!' 'విప్లవం కుట్రకాదు' 'విప్లవ సూర్యోదయం కుట్రకాదు' 'మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి!' 'ప్రజా కళలు, సాహిత్యం, సంస్కృతీ వర్ధిల్లాలి?' 'సాయుధ పోరాటం వర్ధిల్లాలి!' సాయుధ పోరాట ఎర్రజెండా చిరకాలం వర్ధిల్లాలి!' 'అరెస్టులను సాగించి ప్రజాశక్తి నడ్డలేరు, అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతినాపలేరు' వంటి నినాదాలు; 'కష్టజీవులం మేము కమ్యూనిస్టులం' 'దిక్కుమొక్కు లేనిజనం ఒక్కొక్కరు అగ్నికణం' వంటి పాణిగ్రాహి పాటలు 'బోల్షివిక్కు వారసులం, నక్సల్బరి బిడ్డలం' వంటి సంతాల్ పాటలతో విప్లవ ప్రచారాన్ని విప్లవ జెండాను తమ గొంతుల్లో పట్టుదలతో నిర్వహిస్తూనే వున్నారు. వీలయినంత వరకు జనసంచారంలేని వీధులగుండా వీళ్ళను తీసుకపోయే (కోర్టుకు) ఏర్పాట్లు జరిగినా సికిందరాబాద్ రైల్వే బ్రిడ్జ్, రైల్వే కాలనీ, కోర్టు ఆవరణలో, జనం ఎంతో ఆసక్తితో యీ పాటలు, నినాదాలు వింటున్నారు. ముఖ్యంగా కోర్టు ఆవరణలో రకరకాల అన్యాయ శిక్షలు అనుభవించడానికి వస్తున్న అమాయకులు రైల్వేను ఒక జైల్వేగా మార్చిన కేంద్ర ప్రభుత్వ 'ప్రజాస్వామ్య' ధర్మమా అని వందల సంఖ్యలో కేసు వాయిదాలకు వస్తున్న ఉద్యోగాలు పోగొట్టుకున్న రైల్వే కార్మికులు, యీ నినాదాలను పాటలను, ఎంతో సానుభూతితో, చైతన్యంతో వింటున్నారు. తమ చేతులకు తగిలించిన సంకెళ్ళనే మార్చింగ్ వాయిద్యాలుగా మార్చుకుని యీ బృందం పాడుతుంటే యీ దేశంలో కనిపించని సంకెళ్ళు అనుభవిస్తున్న జనం అవి తెంచుకునే మార్గం సుస్పష్టం అవుతున్నట్లు ముఖాలమీద వెలుగుతో మౌనసహకారం అందిస్తున్నారు. ఒక్కోసారి చూడవచ్చిన విరసం సభ్యులు, సానుభూతిపరులు, స్నేహితులు, బంధువులు కూడ ప్రతిస్పందించి తమగొంతులుకూడ కలుపుతున్నారు. కోర్టుహాలు ముందర ఒక చిన్న అమ్మాయి 'కష్టజీవులం, మేము కమ్యూనిస్టులం' పాట చెప్తుంటే యీ 11 మంది పాడారు. కోర్టులోపలి నుంచి విన్న లాయర్లు 'పాపం ఇంత చిన్న పిల్లలను కూడ జెయిల్లో పెడుతున్నారా?!' అని అమాయకంగా ప్రశ్నించారట. ఈ అమ్మాయి ఎవరో వూహించిన పత్రికాపాటి వెంకటేశ్వర్లు 'ఈ దేశంలో సాగుతున్న ఫాసిస్ట్ దమనకాండలో ఏంజరిగినా ఆశ్చర్యపడనక్కర్లేదు' అని అన్నాడట. పోలీసులుకూడా కళ్ళల్లో సానుభూతిని నింపుకుంటున్నారు. ఈ చిన్న అమ్మాయి ఎవరోకాదు కామ్రేడ్ వరవరరావు కూతురు సహజ.

నేటి సమాజంపై రచయిత్రి అవగాహన ఏమిటి?

రచయిత్రి రంగుటద్దాల్లోంచి చూస్తూ రాస్తోన్న ఈ నల్లమందు
సాహిత్యం ఏ ఆవేశాన్ని పాఠకులలో ప్రేరేపిస్తున్నది?
నేటి రచయిత్రి తన కలంతో సాటి స్త్రీపై కురిపిస్తున్నది
అమృతపు జల్లా? విషపు జల్లా?

అందరి రచయిత్రీ కళ్ళుతెరు!

కళ్ళుంటే చూసి
చెవులుంటే విని
మనసుంటే ఆలోచించి
సామాజిక చైతన్యంతో
హేతువాద దృక్పథంతో రాయండి-
మీలాంటి నిర్మలా మూర్తులు ఎందరో సమసమాజం కోసం
పాటుపడుతున్నారు-
మీ కలాలు పదునుపెట్టి వారి బాటలో నడవండి

లేదా-

మీ కలాలు అవతల పారేయండి.

విశాఖపట్నం
1-6-74

విశాఖ విద్యార్థులు

<u>లేఖలు</u>: 'శిక్షాపత్రం' కథలోని సమస్యాపరిష్కారం విప్లవ వ్యతిరేకం!

నక్సల్‌బరిలో రగిలిన నిప్పురవ్వ, శ్రీకాకుళంలో వర్గశత్రు నిర్మూలనద్వారా ప్రజ్వరిల్లి అనేకరాష్ట్రాలకు విస్తరించి, అనేక కారణాలవల్ల తాత్కాలికంగా స్తబ్దత నెదుర్కొంటున్న సమయంలో- ప్రభుత్వం తన ఫాసిస్టుపంజా విసుళ్ళకు అనేకమంది భావసాయుధులైన విప్లవ రచయితలనుగురిచేస్తూ, నామకహో ప్రజాస్వామ్యాన్నిసైతం కుట్రలతో, కుహకాలతో హరిస్తున్న సమయంలో పలికే ప్రతిమాట, చేసే ప్రతిరచనా పీడితవర్గాన్ని వెన్నుతట్టి, వర్గచైతన్యాన్ని కలిగిస్తూ సాయుధపోరాట ఎర్రజెండాను వున్నతంగా ఎగరేసేదేకావాలి! అసిధారావ్రతంలాంటి యీ పనిని నిర్భయంగా, కృతనిశ్చయంతో కొనసాగిస్తున్నప్పటికీ, విప్లవభావ ప్రచారవేదికగా వున్న 'సృజన'లో అడపాతడపా అందుకు వ్యతిరేకమయిన రచనలు ప్రచురింపబడటం విచారకరం.

జూన్‌నెల 'సృజన'లోని 'శిక్షాపత్రం' పీడితవర్గానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడ్డకథ। ఇందులోని నాయుడయ్య పీడకవర్గానికి, ఎంకడు పీడితవర్గానికి ప్రతినిధులు. వున్నతేడాఅల్లా ఎంకడు తను ఏవర్గానికి చెందినవాడో తెలుసుకోలేక, విసిరే ఎంగిలి మెతుకులకోసం వర్గశత్రువు కోపుకాసే లంపెన్‌ఎలిమెంటు। పల్లెల్లోని భూస్వామ్యవర్గ రాక్షసత్వానికి క్రూరంగా బలై పోయిన అమాయికపు ప్రాణి సివంగి।

కూతురు బతుకు బండలైనతర్వాత ఎంకడిలో రగిలేపగ, కసి తనవరకే పరిమితంకాలేదు గతంలో నాయుడయ్య రాక్షసత్వానికి బలైపోయిన అనాథలందరూ అతని మదిలో మెదిలారు. ఆ క్షణాన అన్నాళ్ళు unconscious గా వున్న వర్గ చైతన్యం అతనిలో పెల్లుబుకుతుంది. ఆ చైతన్యపు వున్నతరూపమే 'వర్గశత్రు నిర్మూలన'. "నాయుడయ్యను ఈ భూమ్మీద బతకనిస్తే ఇంకెంతమంది ఆడపడుచుల్ని సెరపడతాడో, రాక్షసుడు" అనుకొని బయలుదేరతాడు. రా. వి. శాస్త్రి అన్నట్టు నెత్తురుతాగేవాడి పీక పిసకటమే సరైందని అనుభవంలో గ్రహిస్తాడు.

ఆఖరిక్షణంలో తన ప్రాణంకోసం వర్గశత్రువువేసే అనేక ఎత్తుల క్షుద్రరూపమే ఎంకడిముందు ప్రాధేయపడటం. పీడితజన క్రోధాగ్నిముందు నయవంచనలకు తావు లేదు. అందుకే రెట్టించినకసితో కత్తి ఎత్తుతాడు. అన్ని చిత్తవగా ఆక్షణాన తన 'పాపం'లో ఎంకడివాటా ఎంతో తెలుపుతూ, ఆవిధంగా అతనిలోని అమాయికత్వాన్ని exploit చేద్దామని ప్రయత్నించటం, దానికి ఎంకడు సెంటిమెంటల్‌గా react అయి వర్గశత్రువుతోపాటు, తన్ను తాను అంతంచేసుకోవటం- మొత్తంగా యిది రచయిత పీడితవర్గానికి పొడిచిన (పెన్ను) వెన్నుపోటు. Defeatist ఆలోచనావిధానం. దీని ద్వారా రచయిత సాధించిందేమిటి ? పీడితవర్గానికి ఒరిగిందేమిటి ? ఓటమి తిరుగుబాటు చేయాల్సిన తరుణంలో ఆత్మహత్య పరిష్కారమార్గంకాదు వర్గశత్రు పాపంలో పంకిలమైన బతుక్కి పరిహారంగానే ఎంకడు నాయుడయ్యను ఖతంచేస్తాడు. భూస్వామ్య వర్గ సిద్ధాంతమే 'అందితే జుట్టు, అందకపోతే కాళ్ళు' కాగా శ్రామికవర్గం అందుకు పూర్తిగా వ్యతిరేకం. బూర్జువాలు చేసేది హింస, శ్రామికవర్గం అనుసరించేది ప్రతిహింస ఇది హేతుబద్ధమైనది న్యాయమైనది ప్రతిహింసద్వారా ముందుకుపోయే పీడితవర్గానికి వెన్నుచరిచే రచనలే ఎన్నడూ కావాల్సింది. రచన అనేది చైర్మన్ మావో అన్నట్లు "ప్రజలను ఐక్యంచేయడానికి, వారిని చైతన్యవంతులను చేయడానికి, అవి (సాహిత్యం-కళలు) బలమైన ఆయుధాలుగా వుపయోగపడాలి. శత్రువుపై దాడి చేయడానికి, శత్రువును నిర్మూలించడానికి ఒకే ఆలోచనతో ప్రజలందరూ హృదయపూర్వకంగా శత్రువుతో పోరాడడానికి అవి బలమైన ఆయుధాలుగా వుపయోగపడాలి."

'అర్థి' గారి ఆలోచనలో unconscious గానే అనుకుంటాను వచ్చిన ఈ తీవ్రమైన set-back పోవాలంటే 'బుగతగాడి మాంసం' (landlord's flesh) తీవ్రంగా

అధ్యయనం చేయటం చాలా అవసరం. అందులో ఆ శ్రమజీవి స్పష్టంగా చెపుతాడు– "బుగతలే ముందుగా జనం మాంసం తింటారు" అని. అదే జనం ఒకదశలో బుగత గాడి మాంసంకోసం ఎగబడతారు. "నాలుగు తులాలు చాలు" అని వెంటబడతారు. యిది దుర్మార్గమనే మేధావులికి చెప్పుతో కొట్టినట్టు చెపుతాడు– "తన చుట్టుపక్కల వాళ్ళను వందలమందిని పొట్టనుపెట్టుకొన్న వాణ్ణి చంపడంలో దుర్మార్గమేముంది?... ...భూస్వాములంతా మన బతుకులతో చెర్లాటలాడినవాళ్ళే. దుర్మార్గులే! మరి మనం చంపింది వాణ్ణొక్కణ్ణే. వాళ్ళంతా మనలాగే బతుకుతున్నారు! దుర్మార్గమంట– ఏం మాటన్నారండి" అని. ఈ కథలో ఆఖరిదశలో బుగతగాడి కన్నీళ్ళు వరదలైపారినా నిస్సిగ్గుగా ప్రాణాలకోసం యాచించినా సరే, ఎత్తిన బల్లాలు నిష్ప్రయోజకంగా దిగవు! వర్గశత్రు నెత్తురులో ఎరుపెక్కి శ్రామిక రాజకీయాధికారంకోసం పరుగులు తీస్తాయి! భూస్వామ్యవర్గ రాక్షసత్వానికి, దోపిడికి గుర్తైన రైతాంగం, కార్మికవర్గం మేల్కొని సాయుధ పోరాటపంథా చేపట్టి తీర్చుకొన్న ప్రతీకారం యొక్క అత్యున్నత రూపమే 'బుగతగాడి మాంసం' కథ. సరైన మార్క్సిస్టు – లెనినిస్టు అవగాహనతో చెప్పబడ్డ కథ.

సృజనలో మేం ఆశించేది యిలాంటి కథలు, కవితలు మాత్రమే! నా యీ సూచనల్ని 'అర్థి'గారు సహృదయంతో అర్థంచేసుకొంటారని ఆశిస్తున్నా!

విప్లవాభినందనలతో
శ్రీకాకుళరావు

['శిక్షాపత్రం' కథ కొన్ని మార్పులతో, ముఖ్యంగా కథాంతంలో, వేద్దామనుకున్నప్పుడు రచయిత అంగీకరించారు. కాని పొరపాటున యిప్పుడున్నరూపంలోనే కథ మేటర్ ప్రెస్‌లోకివెళ్ళిపోవడమూ అచ్చయిపోవడమూ జరిగింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం– 'సృజన'కు నిర్మాణాత్మక సూచనలు చేస్తున్న శ్రీకాకుళరావు గారికి కృతజ్ఞులం– సం]

అచ్చు తప్పులు – సవరణలు

"చారుమజుందారు రచనలు"లో కొన్ని తప్పులు దొర్లాయి. అవి ఆ వ్యాసాల భావాన్నే తారుమారు చేస్తున్నాయి. వాటిని 'సృజన' ఇతర ప్రజా పత్రికలద్వారా తెలియచేసేట్లయితే మిత్రులు గందరగోళపడకుండా వుంటారు.

1. 166వ పేజీ "కామ్రేడ్స్‌కు లేఖ" లోని రెండవ పేరా 5, 6 పంక్తులు యిలా వున్నాయి–

"ప్రపంచ యుద్ధానికి సంబంధించి రెండు అంశాలున్నాయి. ఒకటి యుద్ధం విప్లవానికి హేతువు అవుతుంది. రెండు యుద్ధం విప్లవాన్ని నివారిస్తుంది."

కాని ఆ వాక్యాన్ని యిలా చదువుకోవాలి—

ప్రపంచ యుద్ధానికి సంబంధించి రెండు అంశాలున్నాయి. ఒకటి యుద్ధం విప్లవానికి హేతువు. రెండు విప్లవం యుద్ధాన్ని నివారిస్తుంది.

2. అచ్చులో 189వ పేజి అంటే 181 పేజిలో 'భారత సోవియట్ సైనిక ఒడంబడిక నశించాలి' అన్న వ్యాసంలో 23వ లైనులో చివరిమాట 'పురోగమించాల్సి' బదులు తిరోగమించాల్సి అని చదువుకోవాలి.

3. అచ్చులో 179 అంటే 171వ పేజీ 2వ పేరాలోని మొదటి పంక్తి చివరి మాట 'అవసరమైన షరతులు' బదులు అనవసరమైన షరతులు అని చదువుకోవాలి.

4. 136వ పేజీలో ఒకటవ లైను 'పోరాట వర్గంయొక్క' అనే బదులు వర్గపోరాటం యొక్క అని చదువుకోవాలి.

విప్లవాభినందనలతో
శ్రీకాకుళరావు

రచయితలపై ప్రభుత్వ ఫాసిస్టు దమననీతి-
ఢిల్లీ మేధావుల ఖండన

హీరావల్, ముక్తిఘోరం, జవాహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ సాహిత్య సంస్థ, సర్వనామ్‌మంచ్ అనే 4 సాహిత్య సంస్థలు ఢిల్లీలో జూన్ మొదటివారంలో ఏర్పాటుచేసిన ఒక సమావేశంలో పలువురు మేధావులు ప్రభుత్వం అంతరంగిక భద్రతాచట్టం, దేశరక్షణ నిబంధనలు (MISA & DIR) తదితర ప్రజాస్వామ్య వ్యతిరేక చట్టాలపేరిట ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర మొదలగు ప్రాంతాల్లో తమదోపిడీ విధానాన్ని వ్యతిరేకించే రచయితల, మేధావుల, రాజకీయ వ్యక్తులపై సాగిస్తున్న క్రూరమైన అణచివేతను, హత్యలను మూకఉమ్మడి అరెస్టులను తీవ్రంగా ఖండించడమేగాక శ్రామికవర్గ రచయితలకు తమ మద్దత్తును ప్రకటించారు-

ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రజాందోళన ప్రారంభించాలని కూడా వారు నిర్ణయించారు- ఈ సమావేశానికి అనేకమంది రచయితలు, అధ్యాపకులు హాజరైనారు-

వామపక్ష రచయితల పోజులో ప్రభుత్వం కొమ్ముకాసే కొందరు రివిజనిస్టుల ముఠా యీ సమావేశంలో ప్రవేశించి, విచ్ఛిన్నంచేయాలనే విఫలప్రయత్నంజేసింది- సమావేశ నిర్వాహకులు యీ ముఠానుండి జాగ్రత్తగా ఉండడంమంచిదని ఒక ఢిల్లీ విలేకరి రాశారు-

లైసెన్సులు అవసరంలేదు

నీవు అల్లినకుట్రలో కుట్రను
ప్రజల్లో ప్రకటించడానికి
వీధుల్లో వినిపించటానికి
ఎలా అనుమతిస్తావు నువ్వు ?
ఒక లౌడ్‌స్పీకర్ యివ్వనంతమాత్రాన
మా గొంతులు మూగపోలేదు.
ఇక్కడ, యీ రోజు
మధు, కెవీలూ, వరవర్, చెర, యమ్బి రంగనాథంలూ
ఇంకా ఎందరెందరో కటకటాలు చీల్చుకొని
దూరతీరాలనుండి, వీధి, వీధినుండి
కదలి, మహాజనమై
వెయ్యికంఠాలు, కోటి లౌడ్‌స్పీకర్లై
ప్రజాసమక్షంలో నీ కుట్రను భగ్నంచేశారు
నీ దోపిడీని జనంలో వినిపించడానికి
నీ (తు !) పాకీ చీకటిపాలన చీల్చడానికి
మా కంఠాలకూ, కతులకూ
లైసెన్సులు అవసరంలేదు.

— జ్ఞానేశ్వర్

[విప్లవ రచయితల అరెస్టుల ఖండించేందుకు 20—6—74 నాడు విరసం వరంగల్ శాఖ ఏర్పాటుచేసిన బహిరంగసభనుగూర్చి పట్టణంలో ప్రకటించేందుకు, సభలో ఉపయోగించేందుకు వరంగల్ పోలీసు సూపరింటెండెంటు మైక్ పర్మిషన్ నిరాకరించాడు.]

విప్లవ రచయితల వెంటనే విడుదలచేయాలె-
వారిపైమోపిన కుట్రకేసుల ఎత్తివేయాలె

27 ఏళ్ళ కాంగ్రెసుపాలన పేదలను మరింత పేదలుగా ధనికుల మరింత ధనికులుగా మార్చిందనేది కాదనలేని సత్యం- నిరంతరం పెరిగే ధరలూ, నిరుద్యోగమూ దేశంలో యింకా యీలాంటి దారుణ పరిస్థితులు ఏర్పడేందుకు కారణమైన ప్రభుత్వం సిగ్గుపడేబదులు, అన్నంకోసం, పోరాడే ప్రజల అణచేందుకు పశుబలాన్ని ప్రయోగిస్తున్నది-

యువకుల పెడదోవను పట్టించే సెక్సు, భూస్వామ్య, బానిసభావం సాహిత్యాన్ని, అర్థనగ్న నృత్యా సినిమాలనూ ప్రోత్సహిస్తూ, ప్రభుత్వం, నేటి దోపిడీని, ఆకలిమంట

ను ప్రతిబింబించే విప్లవ రచయితల శాస్త్రీయ రచనలు నిషేధిస్తున్నది. ఇప్పుడు వారిపై కుట్రకేసు బనాయించి జైల్లోపెట్టింది.

ఈ దేశంలో నివసించే ప్రజాతంత్రవాదుల పోరాటశక్తికి యిదొక సవాల్. పోరాటంద్వారానే హక్కుల రక్షించుకోవాలె. దేశంలోని ప్రజా సంస్థలూ, ప్రజాతంత్రవాదులంతా విప్లవ రచయితల విడుదలకై వారిపై మోపిన కుట్రకేసును ఎత్తివేయడానికి ఆందోళన చేయాలి.

పత్తిపాటి వెంకటేశ్వర్లు
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం

హైదరాబాద్
13-6-74

కలాల కత్తుల కోలాటం ఆగదు

ప్రజాసామ్యమని చెప్పుకుంటున్న రజాకారుల కాంగ్రెసు ప్రభుత్వాన్ని వ్యతిరేకించినవారిపట్ల పిచ్చికుక్కలా ప్రవర్తిస్తోంది. రచనా, భావస్వాతంత్ర్యాన్ని అడుగడుగునా అరికట్టాలని ప్రయత్నిస్తోంది. పీడిత ప్రజల పక్షాన నిలబడి, తమ కలాల్ని, కంఠాల్ని ప్రజాపరంచేసి సాయుధపోరాటమే ప్రజాసమస్యలకు పరిష్కారమార్గమని చెబుతున్నారని విప్లవ రచయితల సంఘం కార్యదర్శి త్రిపురనేని మధుసూదనరావుగారిని, విరసం. కార్యవర్గ సభ్యులు వరవరరావు, యం. టి. ఖాన్, చెరబండరాజుగార్లను, 'పిలుపు' పత్రికా సంపాదకులు రంగనాథంగారిని అరెస్టుచేసి, కుట్రకేసు బనాయించి తన ఫాసిస్టు విధానాన్ని బయటపెట్టుకొంది. ఈ అక్రమచర్యను ఖండిస్తూ ప్రజాస్వామ్యవాదులు, రచయితలు, మేధావులు, కార్మిక కర్షక, విద్యార్థి అధ్యాపక సోదరులంతాకలసి ఆందోళన చేయవలసిందిగా పిలుపిస్తున్నాం.

—సంవర్త
కన్వీనర్,
వి.ర సం. యూనిట్, చిత్తూరు జిల్లా.

మరో ప్రకటనలో సంవర్త యిలా తెలియజేస్తున్నారు :

"జులై 26 నాడు తిరుపతిలో ఏర్పాటుచేసిన అత్యవసర సమావేశంలో మాట్లాడుతూ విరసం సభ్యుడు 'జ్యోతి' సుప్రసిద్ధ విప్లవ రచయిత, విరసం కార్యవర్గసభ్యులు, భారత చైనా మిత్రమిండలి కార్యదర్శి మరియు విరసం పత్రిక 'ఎరుపు' సంపాదకులైన శ్రీ కె.వి. రమణారెడ్డిగారి అరెస్టును ఖండిస్తూ, వారి విడుదలను డిమాండ్‌చేశారు. ప్రజాతంత్రవాదులంతా యీ అరెస్టు ఖండించాలని కోరారు.

విప్లవ రచయితల విడుదలకై గుంటూరు లాయర్ల డిమాండు

విప్లవ రచయితలపై మోపిన కుట్రకేసును ఎత్తివేయాలనీ, వారిని వెంటనే విడుదలచేయాలనీ కోరుతూ గుంటూరు పట్టణ న్యాయవాదులు యాభై నాలుగుమంది ఒక ప్రకటనద్వారా డిమాండు చేసారు.

పై ప్రకటనపై సంతకంచేసినవారిలో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులయిన శ్రీయుతులు ఎన్. వి. యల్. నరసింహారావు, జి. కోటేశ్వరరావుగార్లు గుంటూరు యం. యల్. ఎ గారయిన శ్రీ యన్. వెంకటరత్నంగారు; స్వాతంత్ర్య యోధుడు, కవిఅయిన డి. పుండరీకాక్షుడుగారు, ఆర్గనైజేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడయిన శ్రీ భీమిరెడ్డి సుబ్బారెడ్డి, జనసంఘం నాయకులు శ్రీ కె. రాఘవరావు మొ॥ వున్నారు.

పౌరుల ప్రాథమిక హక్కుల రక్షణకొరకు ప్రజాతంత్రవాదులంతా ఆందోళన చేయవలసిందిగాకూడా ఆ ప్రకటనలో వారు విజ్ఞప్తి చేసారు.

(సం) జి. కోటేశ్వరరావు, అడ్వొకేటు
జిల్లా పౌరహక్కుల సంఘ కార్యదర్శి

విప్లవ రచయితలను వెంటనే విడుదలచేయాలి.

దేశం ఆర్థికసంక్షోభంనుండి రాజకీయసంక్షోభానికి నెట్టబడింది. దుర్భరమైన తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలు వువ్వెత్తున పోరాటాలకు దిగకతప్ప టంలేదు. ప్రజల అత్యంత న్యాయమైన పోరాటాలను ప్రభుత్వం తన సైన్యాన్ని, ఆయుధాలను ప్రయోగించి దారుణంగా అణచివేస్తున్నది. హింసకు ప్రతిహింస, ఆయుధానికి ఎదురు ఆయుధంతప్ప మరొకమార్గంలేదు.

మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనావిధానాన్ని ఆయుధంగా చేపట్టి ముందుకు వెళ్ళుతున్న విప్లవప్రజల న్యాయమైన పోరాటాలను హృదయపూర్వకంగా బల పరుస్తూ వాటిని ప్రచారంచేయడమే యీ విప్లవ రచయితలుచేసిన మహాపాపం.

యీ ఫాసిస్టు ప్రభుత్వం ఇప్పటికే యీ రచయితలు చేసిన విప్లవ రచనలను కొన్నిటిని నిషేధించింది. ప్రస్తుతం, వారిని శాశ్వతంగా జైలులోపెట్టడానికి కుట్ర పన్నుతున్నది. కావున ప్రజాస్వామికవాదులంతా యీ అరెస్టులను ఖండించి, విప్లవ రచయితల విడుదలకొరకు ఆందోళన చేయవలసినదిగా విజ్ఞప్తి.

నెల్లూరుజిల్లా పౌరహక్కుల సంఘం

ప్రభుత్వ దమననీతిని ఖండించండి

మళ్ళీ విప్లవ రచయితలను అరెస్టుచేసి ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానాలకే ముప్పు తెచ్చింది. ఇట్టి అరెస్టులను ఖండిస్తూ మా నిరసన తెలుపుతున్నాం- మరియు విప్లవ రచయితలను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం, వరంగల్

ప్రభుత్వ ఫాసిస్టు దమనకాండను బద్దలుకొట్టండి

ఇంతవరకూ ఈ ప్రభుత్వం విప్లవకారులపైన మాత్రమే కుట్రకేసులను బనాయించింది. ఇప్పుడు విప్లవరచయితలను సైతం ప్రజలనుండి దూరంచేయడానికి ప్రభుత్వం కుట్ర సాగిస్తుంది. ప్రభుత్వ దివాళాకోరుతనానికి ఇదొక నిదర్శనం.

ప్రజాస్వామ్యవాదులు మేధావులు, కార్మిక కర్షకులు ఈ ప్రభుత్వ ఫాసిస్టు వైఖరికి వ్యతిరేకంగా పోరాటబాట స్వీకరించాల్సిన అవసరం ప్రస్తుతం ఏర్పడింది. తక్షణం విప్లవకవుల విడుదల చేయాలని అందరూ ఆందోళన సాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

విప్లవ రచయితల సంఘం
అనంతపురం జిల్లాశాఖ

ఎవరు వీళ్ళు? ఎవరి వాళ్ళు?

కార్మికుల కండల్ని కొరుక్కు-తింటున్న ధనస్వాములా?
కర్షకుల నెత్తుర్ని పీల్చేస్తున్న భూస్వాములా?
కాదే! —
అయితే ఎందుకు అరెస్టు చేసినట్టూ?
పీడిత ప్రజలారా! కార్మిక, కర్షక, మేధావి, విద్యార్థుల్లారా!
లెండి- ఈ పాశవిక ప్రభుత్వ చర్యను ఖండించండి—
విప్లవ రచయితల విడుదలకై ఆందోళన చేయండి.

విప్లవ రచయితల సంఘం
కాకినాడ యూనిట్

విప్లవ రచయితల అరెస్టులను ఖండించండి!
పాలకవర్గాల కుట్రను భగ్నం చేయండి!!

విప్లవ రచయితల సంఘం సభ్యులు వరవరరావు, చెరబండరాజు, యం. టి. ఖాన్, మధుసూదనరావు గార్లను అరెస్టుచేసి వారితో మరికొంతమందిని కలిపి బనాయించబడిన "సికింద్రాబాద్ కుట్రకేసు" చరిత్రాత్మకమైన హైద్రాబాద్, పార్వతీపురం కుట్రకేసుల కొనసాగింపేగాని, మరొకటికాదు. ఇదివరకే డాక్టర్ యం. వి రమణారెడ్డిగారిని మరోకేసులో అరెస్టుచేశారు. ఈ కుట్రకేసులు ఎంత విస్తృతమైన వైనప్పటికీ, ఎంత క్రూరమైన వైనప్పటికీ ప్రభుత్వం విజయాన్ని పొందలేదు.

విప్లవ రచయితల అరెస్టులను ఖండిస్తూ వారి విడుదలకై ఆందోళన చేయవలసినదిగా ప్రజానీకాన్నీ, ప్రజా సంస్థలను, వివిధ రాజకీయపక్షాలను కోరుచున్నాం.

విప్లవ రచయితల సంఘం
గుంటూరుజిల్లా యూనిట్

ప్రభుత్వ ఫాసిస్టు పథకాలను వమ్ము చేయండి

విప్లవ రచయితల అరెస్టులు చట్టవ్యతిరేకమని హైకోర్టు కొట్టివేసినా సిగ్గులేని యీ ప్రభుత్వం కొత్త పథకాలతో వారిని దీర్ఘకాలిక నిర్బంధాలకు గురిచేసి వారి కలాలను, కంఠాలను అణచివేయాలని యీసారి వారిని కుట్రకేసులో యిరికించింది.

ప్రభుత్వపు యీ అణచివేత విధానాన్ని తీవ్రంగా ఖండిస్తూ విప్లవ రచయితలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఎస్. వీరభద్రరావు, ఎస్. ఎస్. ఆర్. మూర్తి
ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగుల సంఘం, వరంగల్.

అరెస్టులవల్ల చరిత్రగతి ఆగబోదు

చావుతెలివి ప్రదర్శించుకొంటున్న కాగితపుపులుల ప్రభుత్వం కలాలపై కత్తిగట్టి విరసంను అణిచేయవచ్చుని కలలుగన్నది. కాని విరసం నాటిన విప్లవ బీజాలు నేడు నలుమూలలో విరగబూస్తున్నాయని, విప్లవకవుల అరెస్టులపట్ల నిరసన సభలూ, సమావేశాలూ, కరపత్రాలూ ఆందోళనలు తెలియజేశాయి!

అరెస్టులవల్ల చరిత్రగతి ఆగబోదు!

యువజన సాహితీ సమితి
కొత్తగూడెం (ఖమ్మం)

ప్రజాస్వామ్యం ముసుగులో ఫాసిస్టు చర్యలు

విప్లవ రచయితల సంఘం ఉద్భవించిననాటినుండి, విప్లవ రచనలను నిషేధించటం, రచయితలను నిర్బంధించడం ప్రభుత్వ దమననీతికి నిదర్శనాలు.

ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశచర్యలకు దిగుతూ ప్రజలను రెచ్చగొడుతూన్న ప్రభుత్వం తన పతనానికి మరింత చేరువవుతున్నది.

ప్రోగ్రెసివ్ యూత్ సెంటర్
కణుగులవల్స, శ్రీకాకుళం జిల్లా.

ప్రభుత్వపు కుట్రను భగ్నంచేయండి

విప్లవ రచయితలను అరెస్టుచేసి ప్రభుత్వం తన నిరంకుశ స్వభావాన్ని మరొకసారి బయటపెట్టుకున్నది. ఏ ప్రభుత్వం రచయితల కలాలకు, కంఠాలకు సంకెళ్ళు వేయాలని చూస్తుందో, ఆ ప్రభుత్వం ఎక్కువకాలం మనజాలదు– ప్రభుత్వం ఫాసిస్టు దమననీతి ఖండిస్తూ, విప్లవ రచయితలను విడుదలచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఎన్. చక్రపాణి
డిపో కార్యదర్శి A.P.S.R.T.C. హనుమకొండ.
(బస్సుకలాసీ యూనియన్ పక్షాన)

విప్లవ రచయితలపై ప్రభుత్వం పెట్టిన కుట్రకేసు

"మొగుణ్ణికొట్టి, మొగసాలకెక్కిందన్నట్లు" ప్రభుత్వాన్ని కూలదోసేందుకు విప్లవ రచయితలను తదితర మిత్రులను అరెస్టుచేసి వారిపై "కుట్ర" కేసు బనాయించింది ఈ దోపిడీ ప్రభుత్వం. సమస్త భారత పీడిత ప్రజా విముక్తికై ప్రజలు సాగించే సాయుధ పోరాటాలను బహిరంగంగా బలపరుస్తున్న విప్లవ రచయితలదేనాడూ కుట్ర కాదు. "కుట్ర"కేసు బనాయించిన ఈ పాలకవర్గ చర్య ఆరిపోయే దీపంయొక్క ఆఖరి ఆర్భాటంమాత్రమే.

విప్లవ రచయితల సంఘం
రాజమండ్రి యూనిట్

విప్లవ రచయితల అరెస్టుల్ని ఖండిస్తూ....

'కుట్ర'కేసు పేరుతో విప్లవ రచయితల్ని, వెర్రివెంగళప్పల ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ విధంగా మేధావుల్ని నిర్బంధించడం ప్రభుత్వం ప్రజల్ని యిక ఏమాత్రం పరిపాలించలేని స్థితికి దిగజారిందనడానికి గుర్తే తప్ప మరేమీకాదు.

ఈ సమాజంలో దారుణమైన దోపిడీకి గురౌతున్న కార్మికుల, కర్షకుల, పీడిత ప్రజల పక్షాన నిలబడి, వారిలో తరతరాలుగా నిద్రిస్తూన్న చైతన్యాన్ని రగిలించే ప్రయత్నంలో జైలుపాలైన ప్రజా రచయితలను ప్రజలే రక్షించుకోవాలి. అందుకు నేటి సమాజంలో పీడింపబడుతూన్న యువకులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు, మేధావులు ప్రజాతంత్రవాదులందరు ఐక్యమై ఈ దమనకాండకు వ్యతిరేకంగా పోరాడవలసిందిగా కోరుతున్నాం.

రాడికల్ యూత్, చిత్తూర్.

విప్లవం కుట్రకాదు

అమెరికా సామ్రాజ్యవాదానికి రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదానికి దేశాన్ని తాకట్టుపెట్టిన ఈ దివాళాకోరు ప్రభుత్వం మరలా విప్లవ రచయితలను అరెస్టుచేసి కుట్రకేసు బనాయించింది,

సామాన్యుడు చైతన్యవంతుడుగాకుండా కుట్రపన్నుతున్నది ప్రభుత్వం. కుట్రను బద్దలు కొట్టడానికి విప్లవ రచయితలు ముందుకొచ్చారు. విప్లవ ఝంఝూమారుతంలో ఈ దోపిడీప్రభుత్వం కొట్టుకుపోవడం తథ్యం. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

మేధావులూ, విద్యార్థులూ, కార్మికులూ, కర్షకులూ, అన్ని ప్రజాసంఘాలు విరసం సభ్యుల అరెస్టులను ఖండిస్తూ ఉవ్వెత్తున ఆందోళన జరపాలని కోరుతున్నాం.

చైతన్య సాహితి
అనంతపురం జిల్లా

భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గ్రామ పాలేర్ల వీరోచిత పోరాటం

నల్లగొండ జిల్లా తుంగతుర్తి గ్రామములో పాలేర్ల కూలీల రేట్ల పెంపుదలకై 1–6–74 నుండి ప్రారంభమై నేటివరకు కొనసాగుతూవున్న సమ్మెను విచ్ఛిన్నం చేయుటకు స్థానిక భూస్వాములు పోలీసులు కుమ్మక్కై వ్యవసాయ కార్మికులను ది. 16–6–1974 అర్ధరాత్రి సుమారు 50 మంది రిజర్వు పోలీసులు వచ్చి గ్రామములో అనేక ఇండ్లమీద దాడిచేసి 30 మందిని అరెస్టుచేసి నకిరెకల్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించి, వారిపై నక్సలైట్ కేసు పెట్ట ప్రయత్నించినారు. కాని తుంగతుర్తి గ్రామ ప్రజలు చిన్నలు, పెద్దలు సుమారు 500 మంది 12 మైళ్ళ దూరం పోయి నకిరెకల్ పోలీసు స్టేషన్ ముందు పికెటింగ్ చేశారు. ప్రజా ప్రదర్శనలు చూసిన పోలీసులు కేసుపెట్టుటకు వెనుకడుగు వేశారు. 30 మంది వ్యయసాయ కార్మికులను స్టేషన్ నుండి విడుదల చేయించుకొని నకిరెకల్ నడివీధులగుండా ఊరేగింపుగా గ్రామ గ్రామాలగుండా తుంగతుర్తికి 17–6–74 సాయంత్రం వరకు చేరుకున్నారు. దాదాపు 20 రోజులనుండి సమ్మెకొనసాగుతూనే వున్నది. మిగతా గ్రామాల నుండి కూడ తమ తమ కూలి జీతాల పెంపుదలకై పీడితజనం విప్లవాత్మకంగా ముందుకు రావాలని కోరుతున్నాం. సాయుధ పోరాట ఎర్రజెండా చిరకాలం వర్ధిల్లగాక

తుంగతుర్తి పాలేర్ల సంఘం

పాత బాకీలను చెల్లించివేయాలని తుంగతుర్తి వ్యవసాయ కూలీలపై వొత్తిడి తెస్తూ పోలీసులు అక్కడి భూస్వాముల ప్రయోజనాలను కాపాడుతున్నారనీ, వెంటనే అక్కడి నుండి పోలీసు క్యాంపు ఎత్తివేయాలనీ 'ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం కార్యదర్శి శ్రీ పత్తిపాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనద్వారా డిమాండ్ చేస్తున్నారు.

అంకుశాపురంలో

హైద్రాబాద్ జిల్లా, అంకుశాపురం పాలేర్లు 150 మంది కూలీరేట్ల పెంపుదలకు, ఇతర సౌకర్యాల సాధించడం కోసం 31–5–74 నుండి సమ్మెచేస్తున్నారు. అక్కడి భూస్వాములు వారిలో భయోత్పాతాన్ని రేకెత్తించడానికి ఘటకేశ్వరంనుండి పోలీసులనూ హైద్రాబాద్‌నుండి సీయార్పీనీ రప్పించారు. భూస్వాములతో కుమ్మక్కైన పోలీసులు వ్యవసాయ కార్మిక నాయకుల్ని జైళ్ళలో పెట్టాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. చట్ట వ్యతిరేకమైన యిట్టి నిర్బంధకాండకు హింసా చర్యలకు పూనుకోవద్దనీ, అంకుశాపురం నుండి సీయార్పీ క్యాంపును ఎత్తి వేయాలనీ డిమాండ్ చేస్తున్నాం.

పి. వెంకటేశ్వర్లు
కార్యదర్శి,
ఆం. ప్ర. రాష్ట్ర పౌరహక్కుల సంఘం

అరెస్టులు- బహిరంగసభలు

అనంతపురంలో-

31_5_74 తేదీన అనంతపురంలో విరసం జిల్లాశాఖ బహిరంగసభ ఏర్పాటు చేసింది. సభకు మహాకవి శ్రీశ్రీ గారిని ఆహ్వానించారు. విప్లవ రచయితల్ని అరెస్టు చేసి, వారిపై కుట్రకేసు బనాయించడాన్ని వక్తలు ఖండించారు.

శ్రీశ్రీ, కాశీపతి, (విరసం కార్యవర్గసభ్యుడు), భూమన్ (విరసం నిర్వాహక కార్యదర్శి), ముడార్ వేణు (విరసం జిల్లా కన్వీనర్) ఉపన్యసించారు. విరసం సభ్యుడు నరసప్ప సభకు అధ్యక్షత వహించారు.

విశాఖలో-

6_6_74న విశాఖలో బొబ్బిలి, పార్వతీపురం, రాజమండ్రి, కాకినాడ, విశాఖ 5 విరసం శాఖలుకలిసి వూరేగింపు, బహిరంగసభ జరిపాయి. శ్రీశ్రీ, రావిశాస్త్రి, మిగిలిన సభ్యులు వుపన్యసించారు. జననాట్యమండలి (హైద్రాబాద్, విశాఖ) సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

5 శాఖల జనరల్‌బాడీ నిర్ణయాలు తీర్మానాలు చేసింది. లోగడవలెనే విరసం కార్యక్రమాలన్నీ కొనసాగాలని అన్ని యూనిట్లకు విజ్ఞప్తిచేశారు.

విప్లవ సాహిత్యంమీద, రచయితలమీద ప్రభుత్వంచేస్తున్న క్రూరమైనదాడిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్యముసుగులో ఫాసిస్టు విధానాలవలంభిస్తున్న ప్రభుత్వ నిజస్వరూపాన్ని బయటపెట్టవలసిందిగా కుట్రకేసులను ఎదుర్కోడానికి ఆర్థిక సహాయాన్నివ్వవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తిచేశారు.

హైద్రాబాద్‌లో-

17_6_74 నాడు ఆంధ్ర సారస్వత పరిషత్‌హాల్ హైద్రబాద్‌లో విప్లవరచయితల సంఘం, నగరశాఖ పక్షాన బహిరంగసభ జరిగింది- నగ్నముని, ఆర్.వి.బి. శర్మ మొదలగు పలువురు రచయితలు మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం కుట్రకాదని, ఈ ఆలోచనతో రచనలు చేసే విప్లవ రచయితలు కుట్రదారులుకారనీ ప్రభుత్వమే వీరిపై కుట్రపన్నిందనీ, వీరిని వెంటనే విడుదలచేయాలనీ డిమాండ్ చేశారు.

బెర్హాంపూర్ (ఒరిస్సా)లో-

ఒరిస్సా రాష్ట్రం బెర్హాంపూర్ 'ప్రజా హక్కుల సంఘం' 30_6_74 నాడు సమావేశమై యీ ప్రకటన చేసింది.

"రచనలద్వారా భావప్రచారంచేయడం ప్రజాస్వామిక హక్కు, విధానం- విప్లవ రచయితలను అరెస్టుచేయడం వారిపై కుట్రనేరాన్ని మోపడం వారి భావ స్వాతంత్ర్యాన్నీ, భావ ప్రచార స్వాతంత్ర్యాన్నీ అరికట్టడమే అవుతుంది.

ప్రభుత్వపు యీ చర్యను ఖండిస్తున్నాం.

రాజు

కార్యదర్శి, ప్రజాహక్కుల సంఘం బెర్హాంపూర్, ఒరిస్సా

నిజామాబాద్‌లో-

విప్లవ రచయితల అరెస్టుల సందర్భంగా నిజామాబాద్ విరసం శాఖ, 'చేతనా సాహితి' కలిసి సంయుక్తంగా ఆందోళనా కార్యక్రమాన్ని చేబట్టాయి.

5-6-74 రోజున ఒక నిరసన సభను కార్మికవాడలో జరిపించారు. అందులో వివిధ వర్గాలకుచెందిన ప్రజలు విరసం రచయితలపై ప్రభుత్వం సాగిస్తున్న దమన నీతిని ఖండించారు. 6-6-74 రోజున రెండవ నిరసనసభ పట్టణ ఆవరణలోనే జరిగింది. వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థినాయకులు అరెస్టులను ఖండిస్తూ ఉపన్యసించారు.

9-6-74 రోజున నిజామాబాద్ టౌన్‌హాల్‌లో బహిరంగసభ జరిపించబడింది. ఈ సభలో వివిధ గ్రామాలనుండి వచ్చిన ప్రజలుకూడా పాల్గొన్నారు. శ్రీయుతులు నిఖిలేశ్వర్, అరుణబాబు, నర్సారెడ్డి, ఎ. ఎస్. పోశెట్టి (ఎడిటర్, ప్రజారాజ్యం) గారలు విరసం రచయితల అరెస్టులను తీవ్రంగా ఖండించి ప్రభుత్వకుట్రను భగ్నం చేయవలసిందిగా కోరారు.

ఈ సభలో నిధి సేకరణకు పిలుపివ్వగా, అప్పటికప్పుడే కొంతమంది ప్రజలు ఉత్సాహంగా విరాళాలిచ్చారు. సభలో మహిళలతోసహా 500 మందికి పైగా పాల్గొని విజయవంతం చేశారు.

చేతనా సాహితి, నిజామాబాద్
విరసం శాఖ, నిజామాబాద్.

వరంగల్‌లో-

విప్లవ రచయితల అరెస్టుల ఖండించేందుకు విరసం వరంగల్ యూనిట్‌పక్షాన 20-6-74 నాడు హనుమకొండలో బహిరంగసభ ఏర్పాటుచేయబడింది- పత్తిపాటి వెంకటేశ్వర్లు, లోచన్, డా. శ్రీనివాస్, మొదలగు కామ్రెడ్స్ మాట్లాడుతూ ప్రభుత్వ దమననీతిని ఖండించి, విప్లవ రచయితల విడుదలను డిమాండ్‌చేశారు- సభ అనంతరం 'జననాట్యమండలి' వారు విప్లవ గీతాలతో సాంస్కృతిక ప్రదర్శనలతో జనాన్ని ఉత్తేజితుల చేశారు-

వరంగల్ జిల్లా ఎస్. పి. మైక్ పర్మిషన్ యివ్వక సభను విఫలంచేయాలని ప్రయత్నంచేశాడు- ప్రచారానికిగానీ, సభాస్థలంలోగానీ మైక్ లేకపోయినా సుమారు 2000 పైగా జనం అత్యంత ఉత్సాహంతో పాల్గొని సభనూ, సాంస్కృతిక కార్యక్రమాన్నీ విజయవంతంచేసి స్థానిక పోలీసుకుట్రను భగ్నంచేశారు.

విప్లవ రచయితల సంఘం
వరంగల్, యూనిట్.

విరసం విస్తృత కార్యవర్గ సమావేశ తీర్మానాలు :

విజయవాడ 22-6-74

ప్రభుత్వ ఫాసిస్టు విధానం నశించాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్లవ రచయితలమీద చాలకాలంగా కక్షతో వ్యవహరిస్తున్నది. గతంలో నాలుగుమార్లు విరసం రచయితలను అరెస్టు చేయడం ప్రజాందోళనల వల్ల విడుదల చేయడం జరిగింది. ఈ మారు విరసంపై చావుదెబ్బ వేయాలనే ఉద్దేశంతో బ్రహ్మాండమైన కుట్రపన్ని విప్లవరచయితలైన మధుసూదనరావు, వరవరరావు, చెరబండరాజు, యం.టి.ఖాన్‌లను, వీరితోపాటు పిలుపు ఎడిటర్ రంగనాథం, ఖమ్మం భారతచైనా మిత్రమండలి కార్యదర్శి కోటేశ్వరరావు, మంథెన కాలేజి ప్రిన్సిపాల్ రోశయ్య, విద్యార్థి నాయకుడు కృష్ణమూర్తి తదితరులతోమ సికింద్రాబాద్ కుట్రకేసులో యిరికించింది. జలగం వెంగళరావు ప్రభుత్వం నానాటికీ తన కిరాతకత్వాన్ని నిస్సిగ్గుగా బైటవేసుకుంటున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న దోపిడీ వర్గ అనుకూల విధానంవల్ల దేశంలోని అశేష ప్రజానీకం జీవితం రోజురోజుకూ దీనమైన పరిస్థితికి దిగజారుతున్నది. ఈదశలో ప్రభుత్వ దోపిడీ స్వభావాన్ని అర్థంచేసుకున్న ప్రజలు తమ సమస్యల పరిష్కారాన్ని తమచేతుల్లోకే తీసుకోవడం కొరకు ఆందోళనలకు పోరాటాలకు దిగుతున్నారు. విరసంవారి న్యాయసమ్మతమైన పోరాటాన్ని బలపరుస్తున్నది.

తన ప్రజాపీడనా ధోరణిలో నగ్నంగా ముందుకు వచ్చిన ప్రభుత్వం, ప్రజల చైతన్యాన్ని చూసి భయపడి పోతున్నది. ఆ భయం కొద్దీ మరింత ఉన్మాదంలో ప్రజలపైనా ప్రజాసంఘాలపైన తీవ్ర దమన విధానానికి పాల్పడుతున్నది. విచ్చలవిడి హింసాకాండకూ, కిరాతకాలకు దిగడమేగాక, అక్రమమైన కేసులు బనాయించి అకారణ నిర్బంధాలకుగూడా దిగుతున్నది. దేశంలో నాజీలపాలన అమల్లో పెడుతున్నది ఆటువంటి అనేక దమన విధానాలలో భాగంగానే విరసం రచయితలపైనా తదితరులపైనా ఈ కుట్రకేసును వేసింది.

కాని ప్రభుత్వం ఎంత తీవ్రమైన అణిచివేతకు దిగినప్పటికీ ప్రజాపోరాటాలు ఆగవు. పైగా మరింత నూతనోత్సాహంతో, గొప్ప చైతన్యంతో బలాలను సమీకరించుకొని తమ లక్ష్యంవైపు సాగితీరుతాయి. విరసంగూడా తన సభ్యుల అరెస్టులతో అణగారిపోలేదు. విరసం సభ్యులు తమ కామ్రేడ్స్ విడుదల కొరకూ, తమ భుజస్కంధాలపైన ఉన్న బాధ్యతలను నేరవేర్చడం కొరకూ మరింత పట్టుదలతో పోరాడుతారు. పట్టుదలతో నిలబడుతారు.

ప్రజాభిమానులూ, స్వేచ్ఛా స్వాతంత్ర్య ప్రియులూ అందరూ ఈ ప్రభుత్వ విధానాలను, దాని సాయుధ బలగాల దుర్మార్గాలను ఎదిరించగలరని విరసం గాఢంగా విశ్వసిస్తున్నది.

రైల్వే సమ్మె

న్యాయసమ్మతమైన రైల్వే కార్మికుల సమ్మెను, ప్రభుత్వం ఎంతో క్రూరమైన పద్ధతుల్లో అణచడానికి ప్రయత్నించింది- ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నంచేయడానికి అనుసరించిన పద్ధతులు చాలా ఘోరమైనట్టివి. సమ్మె తర్వాత ప్రభుత్వం, లక్షలాది కార్మికులమీద తన భస్మాసుర హస్తం ప్రయోగిస్తున్నది. లక్షమంది యింక్రిమెంట్లు ఆపేసింది- 20 వేల మందిని ఇండ్లల్లోనుండి వెళ్ళగొట్టింది. 10 వేల మందిని ఉద్యోగాల్లోంచి డిస్మిస్‌చేసింది. ఎంతోమందిని యింకా జైళ్ళలో నిర్బంధించి ఉంచింది. దేశంలో కనీస మానవహక్కులుగూడా లేవని ప్రభుత్వ వైఖరివల్ల స్పష్టమౌతున్నది. ప్రభుత్వంయొక్క- ఈ ప్రజా విరోధవైఖరిని దేశంలోని ప్రజాస్వామికవాదులందరూ తీవ్రంగా ఖండించవల్సి ఉన్నది. సోదర కార్మికులకు ప్రభుత్వం తలపెట్టిన అన్యాయాన్ని ఎదుర్కొనడానికి రైల్వేకార్మికులందరూ సమాయత్తమై నిలబడి పోరాడాల్సిందిగా విరసం విజ్ఞప్తిచేస్తున్నది.

అణుబాంబు

ప్రజలు ఆకలితో మలమల మాడుతూంటే దేశంలో ఆర్థికసంక్షోభం, దుర్భిక్షం విలయతాండవం చేస్తుంటే, కాంగ్రెసు ప్రభుత్వం అగ్రరాజ్యాల సరసన నిలవడంకొరకు యిరుగుపొరుగు దేశాలను బెదిరించడంకొరకు- కోట్లరూపాయిలు ఖర్చుచేసి అణుబాంబును నిర్మించి ప్రయోగించడాన్ని విరసం తీవ్రంగా గర్హిస్తున్నది.

వరంగల్ జిల్లా పోలీస్ సూపరెండెంట్:

విరసం వరంగల్ యూనిట్ 20-1-74 నాడు విప్లవ రచయితల అరెస్టులను ఖండించేందుకు ఏర్పాటుచేసిన బహిరంగసభనుగూర్చి పట్టణంలో ప్రచారం చేయటానికిగాని, బహిరంగసభ స్థలంలో ఉపయోగించడానికిగాని మైక్ పర్మిషన్ ఇవ్వలేదు- పర్మిషన్ నిరాకరిస్తూ చట్టబద్దంగాఏర్పడ్డ ప్రభుత్వాన్ని సాయుధంగా కూలదోయాలని ప్రబోధిస్తున్న విరసం యిదివరకు ఇక్కడ ప్రజలకు ముఖ్యంగా యువజనులకు ఎంతో నష్టం చేసింది. ఇలాంటి విరసం సభలకు తాను వరంగల్‌లో ఉన్నంతకాలం మైక్ పర్మిషన్ ఇవ్వను- ఈ విషయమై అభ్యంతరమేమైనాఉంటే తన ఉన్నతాధికారులకుగాని కోర్టులో ఫిర్యాదుగాని చేయవచ్చునన్నాడు- ఈ విధంగా తన పరిమితులనుదాటి వ్యవహరించిన వరంగల్ యస్. పి. నిరంకుశ వైఖరిని యీ సమావేశం తీవ్రంగా ఖండిస్తోంది.

SRJANA Telugu Monthly July '74 H/WL-10
Regd. No. with Registrar of News Papers 10953/67

ఏదో ఒక కుంటిసాకుపెట్టి ప్రభుత్వం విరసం సభ్యులను అరెస్టు చేస్తూ వస్తున్నది. కొందరు విరసం సభ్యులు ప్రభుత్వాన్ని కూలదొయ్యటానికి కుట్ర చేస్తున్నారని ఆరోపణ ఉన్నదని పత్రికలో చదివాను. ప్రతిపక్షాలన్నీ కలిసి పడగొట్టలేని ప్రభుత్వాన్ని నలుగురు విరసం సభ్యులు ఎలా పడగొట్టగలరు? ఊహించటం అసాధ్యం. విరసం ఆశయం ఒక ప్రత్యేక ప్రభుత్వాన్ని పడగొట్టడం మటుకుకాదు. అది ఎన్నికల పోటీ ఆశయం. విరసం ఆశయం పూర్తిగా సామాజిక వ్యవస్థను మార్చి, ప్రజలకే సమస్త అధికారమూ దక్కేటట్టు చెయ్యటానికి తగిన భావనాసంచలనం కలిగించటం– ఇది ప్రజాస్వామ్యానికి ఎంతమాత్రమూ విరుద్ధంకాదు. బూర్జువా ప్రజాస్వామ్యానికి ఎగువమెట్టు. విప్లవాలు విజయవంతమైన అనంతరంకూడా రష్యా చైనాలలో కమ్యూనిస్టులు కానివాళ్ళు ఇతర పార్టీలవారూ అధికారాన్ని పంచుకోవటం జరిగింది. విప్లవంవల్ల ఆ దేశాలు– ఆ దేశాల ప్రజాజీవితం– కొన్నివేలరెట్లు మెరుగుకాలేదని ఆ దేశపు శత్రువులుకూడా అనలేరు.

ఇంతకూ నేను చెప్పేదేమంటే, రచయితల అరెస్టులు ప్రజలపైన నేరుగా తగిలే దెబ్బ. విరసం రచయితలకన్న ప్రజలమేలు కోరేవారు ఉండబోరు. ప్రజలు ఈ సంగతి స్పష్టంగా గ్రహించి, వారి అరెస్టుల ద్వారా ప్రాధమిక ప్రజాస్వామ్యం దెబ్బతింటున్నదని తెలుసుకొని, ప్రభుత్వం చీటికీ మాటికీ ఇలాంటి ప్రజావ్యతిరేక చర్యలకు పూనుకోకుండా చూసుకోవాలి.

– కొడవటిగంటి కుటుంబరావు